పేజీలు :12
వెల :5/-

జాతీయ తెలుగు దినపత్రిక
www.mediatodaydaily.com

# మీడియా టుడే

మన మీడియా - మన సమాజం

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Rajamandri, Chittur, Visakhapatnam prakasham

సంపుటి : 01 | సంచిక : 67 | సోమవారం 8-6-2026 | పేజీలు 12 | వెల 5/-

## మెట్రో విస్తరణ, మూసీ అభివృద్ధి, ఆర్ఆర్ఆర్‌కు

# కేంద్రం ఎందుకు నిధులు ఇవ్వడం లేదు?

- అనుమతులు తీసుకొస్తే సభపెట్టి సన్మానిస్తాం
- కేటీఆర్ చెప్పినట్టు కిషన్‌రెడ్డి వింటారని బీజేపీ కార్యకర్తలే చెబుతున్నారు.. ఇదేం బుద్ధి?
- బీఆర్ఎస్ పార్టీతో కలిసి గూడుపుఠాణి: సీఎం
- నాగోల్ నుంచి గౌరెల్లి వరకు మూసీ రెండో దశ అభివృద్ధి పనులు చేపడతామని వెల్లడి
- 1,511 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- పౌర సేవలకు 'క్యూర్ వన్' యాప్ ఆవిష్కరణ
- కిషన్‌రెడ్డిని ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్ సిటీ, జూన్ 7 మీడియా టుడే**
"రెండున్నరేళ్లలో కాలికి బలపం కట్టుకొని 50 సార్లు ఢిల్లీకి వెళ్లా.. ఐదు సార్లు ప్రధాని మోదీని కలిశా. అయినా మెట్రో విస్తరణకు అనుమతి రాలేదు. మూసీ ప్రక్షాళన, ఆర్ఆర్ఆర్‌కు నిధులు ఇవ్వరు. ఇవన్నీ ఎందుకు ఆగుతున్నాయి? ఎవరు ఆపుతున్నారో రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. నిజానికి రాష్ట్రానికి ఏవీ దక్కకుండా అడ్డుకుంటున్నది కిషన్‌రెడ్డేఅని మండిపడ్డారు. బీఆర్ఎస్ తో కలిసి ఆయన గూడుపుఠాణి చేస్తున్నారని ఆరోపించారు. కిషన్ రెడ్డి బీజేపీలో ఉంటారుగానీ, బీఆర్ఎస్ వాళ్లతో మాట్లాడుకుంటారని, కేటీఆర్ చెప్పినట్టే వింటారని బీజేపీ వాళ్లే చెబుతున్నారని పేర్కొన్నారు. ఆదివారం మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలోని పలు ప్రాంతాల్లో రూ.1,511 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఉప్పల్ భగాయత్ వేదికగా సీఎం రేవంత్ శంకుస్థాపనలు చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని కార్పొరేషన్ల పరిధిలో ప్రభుత్వ సేవలు అందించే 'క్యూర్ వన్' మొబైల్ యాప్‌ను ఆవిష్కరించారు. ఉప్పల్‌లో ఖత్రి, వంజరి కుల ఆత్మగౌరవ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సబర్మతి, ఢిల్లీలో యమున, యూపీలో గంగా నది తీర ప్రాంతాలను అభివృద్ధి చేశారని.. మరి తెలంగాణలో మూసీ నది ప్రక్షాళన చేయకుండా ఎందుకు అడ్డుపడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి నిలదీశారు. "గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మూసీని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తే.. ఆర్థికంగా, పర్యాటకంగా నగరం పురోగతి సాధిస్తుంది. యువతకు ఉపాధి అవకాశాలు దక్కుతాయి. న్యూయార్క్, న్యూజెర్సీ మధ్య హడ్సన్ రివర్ ఫ్రంట్ వద్ద అపార్ట్‌మెంట్ల విలువ రూ.వందల కోట్లు ఉంది. కానీ ఇక్కడ మురికి వల్లే భూమికి విలువ లేదు. అంతేకాదు ఈ మురికి నల్గొండ జిల్లా ప్రజలను కాలుష్యమై కాటేస్తోంది. ఆలేరు, భువనగిరి పరిసర ప్రాంతాల్లో కొత్తగా పెళ్లయిన జంటలను ప్రెగ్నెన్సీ సమస్య ఉందని ఊరి నుంచి హైదరాబాద్‌కు పంపుతున్నారు. నేను పాదయాత్ర చేస్తున్నప్పుడు మూసీ ప్రక్షాళన చేయాలని ప్రజలు కోరారు. మూసీ నదిని మనం ఎందుకు ప్రక్షాళన చేయొద్దు? ఇళ్లు పోతే ఇళ్లు.. ఉపాధి పోతే ఉపాధి కల్పిద్దాం.. వాళ్ల పిల్లలకు మంచి చదువులు చెప్పిద్దామంటే వద్దంటారు. అడ్డంపడతారు. నువ్వు ఇక్కడి ఎంపీవి కదా.. మూసీ ప్రాజెక్టుకు నిధులు, అనుమతులు తెస్తావా కిషన్‌రెడ్డీ" అని రేవంత్ ప్రశ్నించారు.

**మెట్రోకు అనుమతులు రావడం లేదేం?**
ఢిల్లీ తర్వాత హైదరాబాద్ మెట్రో రెండో స్థానంలో ఉండేదని.. ఇప్పుడు తొమ్మిదో స్థానానికి పడిపోయిందని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. "122 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరించాలని ప్రయత్నిస్తుంటే.. దాదాపు అన్ని అనుమతులు వచ్చాక.. ఇక్కడి నుంచి కేంద్ర మంత్రిగా పనిచేస్తున్న ఆయన అడ్డుపడటంతో అర్ధంతరంగా ఆపే పరిస్థితి వచ్చింది" అని కిషన్‌రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు. తెలంగాణలో 75 లక్షల టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిందని... కేంద్రం అందులో 50 లక్షల టన్నులే సేకరిస్తామంటే, మిగతా 25 లక్షల టన్నులు ఏం కావాలని నిలదీశారు. "పంజాబ్‌లో 86 శాతం కొంటారు. మీ ప్రభుత్వాలున్న రాష్ట్రాల్లో 70-80 శాతం వడ్లు కొంటారు. తెలంగాణలో మాత్రం సగానికి సగం తక్కువ కొంటున్నారు. కేంద్రం మొత్తం కొనేలా చూడాల్సిన బాధ్యత కిషన్‌రెడ్డికి లేదా? మెట్రో విస్తరణకు, ఆర్ఆర్ఆర్‌కు అనుమతులు ఇవ్వాల్సిందే, మూసీ ప్రక్షాళన జరగాల్సిందే.. రైతుల వడ్లు, మక్కలు కొనాల్సిందే.. వీటన్నింటికి నువ్వు సహకరించకుంటే 15 తరువాత కచ్చితంగా కార్యాచరణ ఉంటుంది. బరాబర్ నీ సంగతి చెప్తాం" అని రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలతో పెట్టుకుని బాగుపడినోడు ఎవరూ లేరన్నారు.

**అప్పుడు చేయలేకపోయా.. ఇప్పుడు చేస్తా..**
2018లో జరిగిన గందరగోళంలో కొడంగల్‌లో ఓడిపోయిన తనను మల్కాజ్‌గిరి ప్రజలు ఆదరించి గెలిపించారని రేవంత్ గుర్తు చేసుకున్నారు. నాడు ప్రభుత్వం నుంచి సహకారం అందకపోవడంతో ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయానని, ఇప్పుడు సీఎంగా మీరు కోరుకున్న స్థాయిలో అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి 1.34 కోట్ల మందికి మౌలిక వసతుల ఏర్పాటు, మునిసిపల్, పోలీస్, విద్యుత్ శాఖ, వాటర్‌బోర్డు, మెట్రో తదితర అంశాల్లో పాలనా సమన్వయం కోసమే మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని.. రాజకీయ లబ్ధి కోసం కాదని చెప్పారు. బండారి లక్ష్మారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అయినా.. ఆయన సోదరుడు బండారి రాజిరెడ్డి పేరును ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు పెట్టామని.. ఇలాంటి విషయాల్లో రాజకీయాలతో సంబంధం లేదని పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌ది రజాకార్ల పాలన

- గ్రామాలకెళితే ఆ పార్టీ నాయకులనే ప్రజలు సరిహద్దులు దాటనివ్వరు
- మేం తలుచుకుంటే కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరగలేరు
- కేంద్ర మంత్రులపై మాట్లాడే ముందు సీఎం రేవంత్ రెడ్డి భాష మార్చుకోవాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



**హైదరాబాద్, జూన్ 7: మీడియా టుడే**
కాంగ్రెస్ ప్రభుత్వం రజాకార్ల తరహా పాలన సాగిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలు రజాకార్లతో ఎలా కొట్లాడారో కాంగ్రెస్‌తో కూడా అలాగే కొట్లాడతారని హెచ్చరించారు. మజ్లిస్‌తో సహవాసం వల్ల కాంగ్రెస్‌కు 'రానివ్వం.. చేయనివ్వం..' అనే నిజాం తరహా భాష అలవాటైందని విమర్శించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు అనుమతులు, నిధులు ఇవ్వకపోతే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ పొలిమేర దాటబోరని సీఎం రేవంత్ చేసిన ప్రకటనపై రాంచందర్‌రావు తీవ్రస్థాయిలో స్పందించారు. సీఎం స్థాయిలో ఉన్న నాయకుడు అలాంటి భాష మాట్లాడకూ దంటూ, ఆ మాట అనడానికి ఆయనెవరని ప్రశ్నించారు. 'ఒకవైపు మీ ప్రభుత్వ అవినీతి, అక్రమాలు విచ్చలవిడిగా జరుగుంటే.. మరోవైపు మీ పార్టీ నాయకులు గ్రామాల్లో పేదలపై అక్రమ కేసులు పెడుతున్నారు. వారి భూములు లాక్కుంటున్నారు. ఇలాంటి పరిస్థితి ఉంటే.. కేంద్రం ఏమిచ్చింది? కేంద్ర మంత్రులను పొలిమేర దాటనివ్వబోమని మాట్లాడతారా? గ్రామాలకు వెళితే మిమ్మల్నే సరిహద్దులు దాటనివ్వరు. బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే కాంగ్రెస్ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరగలేరే'ని హెచ్చరించారు. కాంగ్రెస్, బీఆర్ఎ?సలను రాష్ట్ర ప్రజలు తరిమికొట్టడం ఖాయమన్నారు. రైతు సంక్షేమం గురించి పదేపదే మాట్లాడే సీఎం రేవంత్.. కోహెడలో సమీకృత పళ్ల మార్కెట్ కోసం వారి నుంచే బలవంతంగా భూములు లాక్కున్నారని, వారికి పరిహారం ఇవ్వకుండానే మార్కెట్‌కు శంకుస్థాపన చేశారని ఆరోపించారు. సీఎం పర్యటన సందర్భంగా రైతులను పోలీసు స్టేషన్లలో నిర్బంధించడం దురదృష్టకరమన్నారు. రైతులకు పరిహారం చెల్లించిన తర్వాతే మార్కెట్ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. 'తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులపై, జిల్లాలకు కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన నిధులపై సెక్రటేరియట్ గేటు వద్ద బహిరంగ చర్చకు సిద్ధమ'ని సీఎం రేవంత్‌కు ఆయన సవాల్ చేశారు. గడచిన 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం తెలంగాణకు రూ.13 లక్షల కోట్లు విడుదల చేసిందని పేర్కొంటూ, చిత్తశుద్ధి ఉంటే వీటిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ వంటి జిల్లాల్లో ఎలాంటి ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందో వెల్లడించాలని డిమాండ్ చేశారు. 'కాంగ్రెస్‌ది అవినీతి, కమీషన్ల పాలన. బీఆర్ఎస్ కూడా ఇలాగే చేస్తే ఆ పార్టీని రాష్ట్ర ప్రజలు ఇంటికి పంపించారు. కాంగ్రెస్‌కు కూడా అదే గతి పట్టడం ఖాయమ'ని అన్నారు. కాగా, ఏబీవీపీ సభ్యత్వ నమోదును ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రావుల కృష్ణ ఆదివారం ప్రారంభించారు.


## రూ.661 కోట్ల ప్రభుత్వ
# నిధుల మళ్లింపు




**న్యూఢిల్లీ, జూన్ 7:మీడియా టుడే**
ప్రభుత్వ నిధులను అధికారుల సొంత ప్రయోజనాలకు మళ్లించారన్న కేసులో సీబీఐ ఆదివారం ఆరు చోట్ల దాడులు చేసింది. హరియాణా రాష్ట్ర ప్రభుత్వంతోపాటు చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన అధికారులు ఐడీఎఫ్‌సీ బ్యాంకు, ఏయూ ఫైనాన్స్ బ్యాంకుల సిబ్బందితో కుమ్మక్కయి ఏకంగా రూ.661 కోట్లను దారి మళ్లించినట్టు కేసు నమోదు చేసింది. ఇందుకు విపం కన్సల్టెన్సీ అనే సంస్థ సహకారం తీసుకున్నట్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో చండీగఢ్, పంచకుల, ఢిల్లీ-ఎన్‌సీఆర్, నోయిడాల్లో ఆరు చోట్ల ప్రభుత్వ అధికారులకు చెందిన ఇళ్లల్లో సోదాలు చేసింది. నోయిడాలోని విపం కన్సల్టెన్సీ కార్యా లయం, ఆ సంస్థ డైరెక్టర్ నివాసాలపైనా దాడు లు చేసింది. ఎనిమిది విభాగాలకు చెందిన నిధులు దుర్వినియోగమయినట్టు సీబీఐ గుర్తించింది. బ్యాంకు అధికారుల సాయంతో ఒక పద్ధతి ప్రకారం నిధులను తొలుత విపం కన్సల్టెన్సీకి మళ్లించి, అనంతరం అధికారులు సొంతానికి ఉపయోగించుకున్నారని తెలిపింది.

# భూ సమస్యలపై రంగంలోకి సీఎం


- క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలన - నేడు సిద్ధాంతంలో రైతులతో ముఖాముఖి
- రీసర్వే 1.0 సమస్యల పరిష్కారంపై ఆరా - పొలాల్లోకి వెళ్లి వారితో చర్చలు
- వెంట ఉండేది సర్వేయర్, వీఆర్వో మాత్రమే - 1936 మందికి కొత్త పాస్‌పుస్తకాల పంపిణీ
- వీరిలో 54 మంది ఇనామ్ సర్వీస్ రైతులు



**అమరావతి జూన్ 7 :మీడియా టుడే**
భూముల రీసర్వే 2.0 ఎలా జరుగుతోంది.. రైతుల అభ్యర్థనలను అధికారులు పరిశీలిస్తున్నారా.. వారికి నోటీసులిచ్చాకే భూములు కొలతలు వేస్తున్నారా.. వివాదాల పరిష్కారం ఎలా ఉంటోంది.. రైతుల మనోగతం ఏమిటి.. ఈ ప్రశ్నలకు వాస్తవిక సమాధానాలు తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా రంగంలోకి దిగారు. సోమవారం ఉదయం ఆయన పశ్చిమ గోదావరి జిల్లా వాసవీ పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామాన్ని సందర్శించనున్నారు. భూ సమస్యల పరిష్కారం.. ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం, రెవెన్యూ అంశాలపై క్షేత్ర స్థాయిలో సమగ్రంగా పరిశీలిస్తారు. పనిలోపనిగా తొలి విడత రీసర్వేకు సంబంధించి రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదార్ పాస్‌పుస్తకాలు కూడా పంపిణీ చేస్తారు. జగన్ హయాంలో 6,675 గ్రామాల్లో రీసర్వే జరిగితే రైతులకు అనేకానేక సమస్యలు ఎదురయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ గ్రామాల్లో సభలు నిర్వహించగా.. 8.75 లక్షల మంది ఫిర్యాదులు చేశారు. ముఖ్యంగా ఇనామ్ రైత్వారీ పట్టాలున్న రైతులకు తీవ్ర సమస్యలు ఉత్పన్నమయ్యాయి. రెవెన్యూ అధికారులు రికార్డులు, వెబ్‌ల్యాండ్ డేటా పరిశీలన చేయకుండానే.. రైత్వారీ పట్టాలున్న భూములను కూడా సర్వీసు ఇనామ్‌గా రీసర్వే రికార్డుల్లో నమోదు చేశారు. అనంతరం ఆ రైతులకు ఇనామ్(సర్వీసు) భూములుగా పట్టాలు ఇచ్చారు. ఇది పూర్తిగా అధికారులు చేసిన తప్పేనని నిర్ధారణ అయ్యింది. సిద్ధాంతం గ్రామంలోనూ 54 మంది ఇనామ్ రైతులు ఈ తరహా సమస్యలు ఎదుర్కొన్నారు. ఇప్పుడీ సమస్యను రెవెన్యూ శాఖ పరిష్కరించింది. రీసర్వే 1.0లోని లోపాలను సరిదిద్ది రికార్డులను సవరించింది. రైత్వారీ పట్టాలున్న రైతుల భూమి రికార్డుల్లో సర్వీసు ఇనామ్ అనే పదం తొలగించారు. వాటిని రైత్వారీ పట్టాలుగానే పరిగణించాలని, గ్రామ రెవెన్యూ రికార్డుల్లో రైతుల పేరిటే రికార్డును పొందుపరిచారు. ఇలాంటి సమస్యలు అనేక గ్రామాల్లో ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో అసలు క్షేత్రస్థాయిలో సమస్యలకు రెవెన్యూ యంత్రాంగం సరైన పరిష్కారం చూపిస్తోందో లేదో సీఎం ప్రత్యక్షంగా సిద్ధాంతంలో తెలుసుకోన్నారు. పొలాల వద్దకు వెళ్లి రైతులతో నేరుగా మాట్లాడతారు. ఆయన వెంట గ్రామ సర్వేయర్, వీఆర్వో మాత్రమే ఉంటారు. వచ్చే ఏడాది మార్చి నాటికి భూముల రీ సర్వే 2.0 పూర్తిచేయాలని సీఎం రెవెన్యూ శాఖకు లక్ష్యాన్ని నిర్దేశించిన సంగతి తెలిసిందే. క్షేత్ర స్థాయిలో తాను ఆశించిన పురోగతి, మార్పు ఎలా ఉందో ఆయన సిద్ధాంతంలో పరిశీలిస్తారు. సిద్ధాంతం గ్రామంలో 1936 మంది రైతులకు ముఖ్యమంత్రి నూతన పట్టాదార్ పాస్‌పుస్తకాలను అందించనున్నారు. ఇందులో ఇనామ్ రైత్వారీ పట్టాలున్న రైతులు 54 మంది ఉన్నారు. ఈ రైతులకు గత ప్రభుత్వం ఇచ్చిన రికార్డుల్లో సర్వీసు ఇనామ్ అని ఉంది. ఆ పేరిటే పాస్‌పుస్తకాలు ఇచ్చారు. దీని వల్ల మూడేళ్లపాటు ఆ భూములపై లావాదేవీలు జరగలేదు. వాస్తవానికి ఆ భూములు ఎప్పుడో రైత్వారీ పట్టాలుగా మారాయి. రీ సర్వే 1.0లో వచ్చిన తప్పులను అధికారులు సరిదిద్దారు. రికార్డుల్లో రైతుల పేర్లే నమోదుచేశారు. ఇనామ్ సర్వీసు అన్న పదం తొలగించి.. ఇనామ్ రైత్వారీ పట్టాగా నమోదు చేసినట్లు తెలిసింది. రాజముద్రతో ఉన్న ఆ కొత్త పాస్‌పుస్తకాలను రైతులకు సీఎం అందిస్తారు.

# తిరుచ్చి ఈస్ట్ బరిలో రాఘవ లారెన్స్?

- టీవీకే నుంచి పోటీచేస్తారని ప్రచారం - 11న ప్రకటన చేయనున్నట్లు వెల్లడి
- టీవీకే అభ్యర్థిగా పోటీచేస్తారని ప్రచారం.. 11న ప్రకటన!



**చెన్నై, జూన్ 7 మీడియా టుడే**
ప్రముఖ సినీనటుడు, కొరియోగ్రాఫర్, దర్శకుడు రాఘవ లారెన్స్ (49) రాజకీయ ప్రవేశానికి రంగం సిద్ధమైనట్లు కనిపిస్తోంది. సీఎం విజయ్ పార్టీ టీవీకే తరఫున ఆయన ఎన్నికల బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. విజయ్ రాజీనామాతో తిరుచిరాపల్లి (తిరుచ్చి) ఈస్ట్ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికలో పోటీ చేయడానికి ఆయన సన్నాహాలు చేసుకుంటున్నట్లు సమాచారం. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే అధినేత నేత విజయ్ తిరుచ్చి ఈస్ట్, పెరంబూరు నియోజకవర్గాల్లో పోటీ చేసి గెలిచారు. సీఎం పదవిని చేపట్టాక తిరుచ్చి ఈస్ట్ శాసనసభ్యత్వానికి ఆయన రాజీనామా చేశారు. ఇక్కడ లారెన్స్ టీవీకే తరఫున పోటీ చేయనున్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో లారెన్స్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టారు. తన భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి కీలకమైన నిర్ణయాన్ని 11న ప్రకటిస్తానన్నారు. తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గం ఎన్నికల్లో తాను పోటీ చేయబోతున్నట్లు వివిధ ప్రసారమాధ్యమాల్లో వార్తలు వెలువడుతున్నాయని.. ఆ విషయమై తన వివరణ కోరుతూ మీడియా మిత్రులు చాలా మంది ఫోన్ ద్వారా, వ్యక్తిగతంగా సంప్రదిస్తున్నారని.. వాటిపై వివరణ ఇవ్వాల్సిన బాధ్యత తనకుందని తెలిపారు. ప్రస్తుతం తాను 'బెంజ్' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నానని, చిత్రీకరణ షెడ్యూల్ ఈ నెల 10తో ముగుస్తుందని, మర్నాటి ఉదయం 9.30 గంటలకు విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి.. తన తల్లి ఆశీస్సులతో తన కెరీర్‌కు సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాన్ని ప్రకటిస్తానని వివరించారు.

# మేజర్ అభిలాషకు
# 'యూఎన్ మిలిటరీ జెండర్ అడ్వకేట్' పురస్కారం




**న్యూఢిల్లీ, జూన్ 7: మీడియా టుడే**
భారత సైన్యంలో యుద్ధ హెలికాప్టర్ నడిపిన తొలి మహిళా పైలట్‌గా రికార్డు సృష్టించిన మేజర్ అభిలాష బరాక్ ప్రతిష్టాత్మక 'యూఎన్ మిలిటరీ జెండర్ అడ్వకేట్ ఆఫ్ ద ఇయర్-2025' అవార్డును అందుకున్నారు. పశ్చిమాసియా దేశం లెబనాన్‌లో మహిళలు, బాలికల కోసం చేపట్టిన విస్తృత సేవా కార్యక్రమాలకు గాను ఆమెను ఈ పురస్కారం వరించింది. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ శుక్రవారం ఆమెకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను సేవ చేస్తున్నవారితో పాటు, తనతో కలసి పనిచేస్తున్న వారికి ఆమె ఒక రోల్ మోడల్ అని కొనియాడారు. మేజర్ సుమన్ గవానీ, మేజర్ రాధికా సేన్ తర్వాత మన దేశం నుంచి ఈ పురస్కారం అందుకున్న మూడో మహిళగా అభిలాష నిలిచారు. హరియాణాలోని రోహ్‌తక్‌కు చెందిన అభిలాష 2018 సెప్టెంబరులో ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ కార్ప్స్‌లో చేరారు. ప్రస్తుతం ఆమె లెబనాన్‌లోని ఐక్యరాజ్య సమితి మధ్యంతర దళం (యూఎన్ఐఎ?ఫఐఎల్) కింద భారత బెటాలియన్‌లో ఎంగేజ్‌మెంట్ టీమ్ కమాండర్‌గానూ, జెండర్ ఫోకల్ పాయింట్‌గానూ సేవలు అందిస్తున్నారు.

# "శికం-సర్కారీ" భూమి, "శికం-పట్టా" భూమి మధ్య తేడా ఏమిటో

**ఆరోపణలు చేస్తున్నవారికి తెలుసా వి. రవికృష్ణ**

**సోషల్ మీడియాలో పవన్ కళ్యాణ్ భూముల వ్యవహారంలో**

**కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలను ప్రశ్నించిన సామాజిక కార్యకర్త,హైకోర్ట్ న్యాయవాది వి. రవికృష్ణ**



**బాపట్ల కృష్ణమోహన్, మీడియా టుడే, జూన్ 7:**
ఇప్పుడు కొందరు చెబుతున్నట్లుగా సర్వే నం.706 నిజంగానే ప్రభుత్వ భూమి, శికం-సర్కారీ భూమి లేదా అక్రమ కబ్జా అయితే దాదాపు పదేళ్ల పాటు మీ ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంది?. నిజంగా అది ప్రభుత్వ భూమి అయితే: రిజిస్ట్రేషన్ ఎలా జరిగింది మ్యుటేషన్ ఎలా జరిగింది? పట్టాదారు పాస్‌బుక్‌లు ఎలా జారీ అయ్యాయి? రెవెన్యూ రికార్డుల్లో ఇప్పటికీ "శికం-పట్టా"గా ఎందుకు చూపిస్తున్నారు? సంబంధిత అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదు ??డాక్యుమెంట్ నం.3213/2014 తేదీ 15-12-2014న శంకర్‌పల్లి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ అయింది.??02-06-2014 నుంచి డిసెంబర్ 2023 వరకు తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఆ కాలంలో మీ తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్నారు. మీరు స్వయంగా ఎంపీగా, అనంతరం ఎమ్మెల్సీగా పనిచేశారు. ప్రభుత్వ రికార్డులు, ధరణి వివరాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, రెవెన్యూ వర్గీకరణలను పక్కన పెట్టి సోషల్ మీడియా ట్రయల్స్ నిర్వహించడం వల్ల నిజాలు మారవు.కనీసం "శికం-సర్కారీ" భూమి, "శికం-పట్టా" భూమి మధ్య తేడా ఏమిటో ఆరోపణలు చేస్తున్నవారికి తెలుసాప్రశ్నలు చాలా సులభం:భూమి అక్రమమైతే మీ ప్రభుత్వం పదేళ్ల పాటు ఎందుకు చర్యలు తీసుకోలేదు?. అక్రమం కాకపోతే ఇప్పుడు రాజకీయ కథనాల కోసం "కబ్జా", "ల్యాండ్ గ్రాబింగ్" అంటూ ప్రచారం ఎందుకు చేస్తున్నారు. చట్టం, అధికారిక రికార్డులు, సమర్థ అధికారుల విచారణే నిజాన్ని తేల్చాలి --- యూట్యూబ్ తీర్పులు కాదు.

# అగ్ని వీరికి ఎంపికైన జగిత్యాల యువకులు

**యువత జీవితం లో స్థిరపడేందుకు నా వంతు కృషి చేస్తా**

**బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ స్టడీ సర్కిల్ సెంటర్ల ఏర్పాటు చేయించాం**

**నాణ్యమైన బోధకుల చేత శిక్షణ ఇప్పిస్తున్నాం - త్వరలోనే జగిత్యాలలో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయిస్తా..**

**అందుకు సంబంధించి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తో చర్చలు పూర్తయ్యాయి**

**స్థలం కావాలని హెచ్ . సి. ఎ.. కలెక్టర్ కు లేఖ రాసింది -రాజకీయాల్లోకి వచ్చింది సేవ చేయడానికి**

**మాటల యుద్ధం చేయడానికి కాదు**



**జగిత్యాల మీడియా టుడే- జూన్ 7**
జగిత్యాల పట్టణానికి చెందిన 12 మంది యువకులు ఇటీవల భారత మిలటరీ (అగ్ని వీర్) కు ఎంపికయ్యారు.. వీరంతా జగిత్యాల పట్టణంలో ని ఎస్.కె. ఎన్ . ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రతిరోజు శిక్షణ కొనసాగించారు.. జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్ జగిత్యాల పట్టణ పరిసర ప్రాంత యువకులకు పోలీస్ మరియు మిలిటరీ కి ఎంపిక అయ్యేవిధంగా పట్టణంలోనీ ధర్మపురి రోడ్ లో గల ప్రభుత్వ కళాశాల మైదానంలో ప్రత్యేకంగా 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్, లాంగ్ జంప్, హై- జంప్, వాల్ జంపింగ్, ఇంకా ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయించారు. ఇందుకోసం ఆయన ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని నిధులను కేటాయించడం వలన ఈరోజు 12 మంది యువకులు అగ్ని వీర్ కు ఎంపికయ్యారని పట్టణంలోని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు..

**యువత జీవితంలో స్థిరపడేందుకు నా వంతు కృషి చేస్తా.... ఎమ్మెల్యే సంజయ్..**

పట్టణంలోని 12 మంది యువకులు అగ్ని వీరు కు ఎంపిక కావడం పట్ల స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ ఎంపికైన యువకులకు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి యువత సిద్ధమవడానికి కావలసిన పుస్తకాల కోసం గ్రంధాలయంలో అన్ని సమకూర్చామని, బీసీ ఎస్సీ ఎస్టీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి నాణ్యమైన బోధకుల చేత శిక్షణ ఇప్పిస్తున్నామని అలాగే మన యువత పోలీస్ మరియు ఆర్మీకి ఎంపిక కావడానికి శారీరక దృఢత్వం పరీక్షలలో అర్హత సాధించాలని ఆలోచనతో 400 మీటర్ల రన్నింగ్ మరియు ఇతర సదుపాయాలు ప్రత్యేక నిధులు కేటాయించి ఏర్పాటు చేయడం జరిగింది. అతి త్వరలో ఈ 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ సింథటిక్ ట్రాక్ గా ఏర్పాటు చేయిస్తా..అంతేకాకుండా జగిత్యాల జిల్లాలోని క్రీడాకారుల సౌకర్యం కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తో మాట్లాడి జిల్లాలో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేసేందుకు గాను. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ లో సభ్యుడిగా ఉన్న ఒక సీనియర్ జడ్జి దృష్టికి కూడా జగిత్యాల జిల్లాలో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాలని తీసుకువెళ్లడం జరిగింది.. అందుకు సంబంధించి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా కలెక్టర్ కు స్టేడియం కొరకు స్థలం ఇవ్వాలని లేఖ రాయడం జరిగింది. శాసనసభ్యునిగా ఈ పదవి కాలంలోనే క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయిస్తా.. ఇంకా యువత ప్రభుత్వ ఉద్యోగాలలో స్థిరపడాలంటే ఏమైనా వసతులు ,శిక్షణ సదుపాయాలు, కంప్యూటర్ సంబంధిత కోర్సులు నేర్చుకుంటామన్న, చేతివృత్తులు ఇతరత్రా కావాలన్నా నా దృష్టికి తీసుకు వస్తే అవి ఏర్పాటు చేయించేందుకు నా వంతు కృషి చేస్తా..పనితీరుతోనే విమర్శలకు సమాధానం...గత కొద్ది రోజులుగా కాంగ్రెస్ ప్రభుత్వం పైన నా పైన లేనిపోని విమర్శలు చేస్తూ పబ్బం గడుపుతున్న ప్రతిపక్ష పార్టీల నాయకులకు ప్రతిదానికి మాటలతో సమాధానం చెప్పి విలువైన సమయాన్ని వృధా చేసుకోను.. వారికి మాటలతో సమాధానం చెప్పడానికి బదులు నా సమయాన్ని, దృష్టినిఅభివృద్ధి పనులపై కేంద్రీకరిస్తా.. మాట్లాడితే పనులు కావు.. ప్రయత్నించి ముందుకెళ్తే పనులు అవుతాయి..సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చాను మాటల యుద్ధం చేయడానికి కాదు... అని అన్నారు..ప్రతి గ్రామం నుండి అగ్ని వీర్ కు ఎంపిక అవ్వాలి.. ఎం.పీ. ఓ. రవి..ఈ సందర్భంగా రూరల్ ఎంపీఓ రవి మాట్లాడుతూ గ్రామంలోని యువత ప్రతి ఒక్కరూ మిలిటరీలో చేరాలని గ్రామం నుండి ఒక యువకుడైన మిలిటరీ (అగ్ని వీర్) కు ఎంపిక అవ్వాలి అప్పుడే గ్రామము మరియు దేశము భద్రంగా ఉంటుంది.. అందుకే తన కుమారుడు కందుకూరి భరత్ ను కూడా మిలటరీ కి పంపించాంఅని ఆయన ఇప్పుడు మేజర్ గా పని చేస్తున్నాడు అని అన్నారు..ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి-శ్రీనివాస్, ఆత్మ చైర్మెన్ కాట్పల్లి గంగారెడ్డి, కౌన్సిలర్ లు ఏనుగుల లావణ్య-రాజు, దయల చంద్రకళ-శంకర్, కూతురు శేఖర్,సీనియర్ నాయకులు బాలముకుందం, తోట మల్లికార్జున్, వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ములసపు రాజన్న, అధ్యక్షులు గుండ సురేష్, ప్రధాన కార్యదర్శి సాగి శ్రీధర్ రావు, మేనెన్ని శ్రీధర్ రావు మాజీ సర్పంచ్ రమణారావు, పురుషోత్తం రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ములుగు మున్సిపాలిటీలో బండారుపల్లి నిర్లక్ష్యం

**వర్షాకాలం వచ్చినా మారని రోడ్ల గతి - నాలుగు నెలలు గడుస్తున్నా శూన్యం**

**కొత్త మున్సిపాలిటీలో పనులేవి- లోతట్టు రోడ్లతో నరకప్రాయం**

**ఇళ్లలోకి చేరుతున్న వర్షపు నీరు- అధికారుల నిర్లక్ష్యంపై బండారుపల్లి వార్డుల ప్రజల తీవ్ర ఆగ్రహం.**



**ములుగు మున్సిపాలిటీ బండారుపల్లి జూన్07(మీడియా టుడే)**
ములుగు జిల్లా కేంద్రంలోని ములుగు మున్సిపాలిటీలో విలీనమైన బండారుపల్లి గ్రామ ప్రజలు అధికారుల, పాలకవర్గ నిర్లక్ష్యంపై నిప్పులు చెరుగుతున్నారు. మున్సిపాలిటీగా ఏర్పడి నాలుగు నెలలు గడుస్తున్నా, తమ గ్రామంలో కనీస అభివృద్ధి పనులు కూడా మొదలు పెట్టకపోవడంపై వార్డుల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు ఆర్భాటాలు చేసిన ప్రజాప్రతినిధులు, ఇప్పుడు సమస్యల వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు.రెండేళ్లుగా నరకయాతన.. లోతుకు పడిపోయిన రహదారులు!గత రెండు సంవత్సరాలుగా కురుస్తున్న భారీ వర్షాలకు బండారుపల్లి గ్రామంలోని వార్డులలో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇళ్లు ఎత్తులో ఉండి, రహదారులు లోతుకు వెళ్ళిపోవడం వల్ల చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. గత ఏడాది కురిసిన వర్షాలకు నీరంతా ఇళ్లలోకి చేరి, నిత్యావసర వస్తువులు తడిసిపోయి, రాత్రంతా జాగారం చేయాల్సి వచ్చిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు విజృంభించి, రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు మారారు.. రాత మారలేదు!గతంలో గ్రామ పంచాయతీ అధికారులకు, సిబ్బందికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని, కొత్తగా మున్సిపాలిటీ ఏర్పడితేనైనా తమ బతుకులు మారుతాయని ఆశపడ్డామని ప్రజలు చెప్తున్నారు. కానీ, మున్సిపాలిటీ ఏర్పడి నెలలు గడుస్తున్నా ఒక్క అధికారి కానీ, మున్సిపల్ చైర్మన్ కానీ ఇటువైపు వచ్చి చూడలేదని ధ్వజమెత్తారు. ప్రస్తుతం మళ్లీ వర్షాకాలం ప్రారంభం కావడంతో, ఈ ఏడాది కూడా తమకు నరకం తప్పదా అని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.మున్సిపల్ చైర్మన్ గారూ.. తక్షణమే స్పందించండి!ఈ లోతట్టు రోడ్లలో మట్టి మరియు మెటల్ పోసి, మెయిన్ రోడ్డు స్థాయికి సమానంగా ఎత్తు పెంచితేనే నీటి నిల్వ సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మున్సిపల్ చైర్మన్ మరియు ఉన్నతాధికారులు తక్షణమే బండారుపల్లి గ్రామంలో పర్యటించి, యుద్ధప్రాతిపదికన కనీసం తాత్కాలి కంగానైనా మెటల్ రోడ్లు వేయించాలని కోరుతున్నారు. వర్షాలు ముదరక ముందే స్పందించి తమ ఇళ్లలోకి నీరు రాకుండా చూడాలని, లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ముందర పెద్ద ఎత్తున ధర్నాకు దిగుతామని బండారుపల్లి గ్రామ ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ చాటిన బి. రక్షిత్

**కోదాడ, జూన్ 7 (మీడియా టుడే)-:**
కోదాడలోని తేజ టాలెంట్ స్కూల్ స్కూల్ విద్యార్థి బి. రక్షిత్ సూర్యాపేట జిల్లా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్--2026 పోటీలలో అండర్-15 విభాగంలో ద్వితీయ స్థానాన్ని సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచాడు.ఈ అద్భుత విజయంతో బి. రక్షిత్ త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో సూర్యాపేట జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. అతని ఈ విజయానికి కోచ్ లల్లు సర్ అందించిన నిరంతర




శిక్షణ, కృషి మరియు మార్గదర్శకత్వమే ప్రధాన కారణమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.ఈ సందర్భంగా టేజా టాలెంట్ స్కూల్ డైరెక్టర్ ఎస్. జానకిరాములు, ప్రిన్సిపాల్ బి. సోమా నాయక్, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది బి. రక్షిత్‌ను అభినందించి, రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబర్చి విజేతగా నిలవాలని ఆకాంక్షిస్తూ తమ శుభాకాంక్షలు తెలిపారు.పాఠశాల విద్యార్థులు క్రీడలు మరియు విద్యా రంగాలలో సమానంగా రాణించేందుకు టేజా టాలెంట్ స్కూల్ ఎల్లప్పుడూ ప్రోత్సాహాన్ని అందిస్తోందని వారు తెలిపారు.

## పటాన్ చెరు జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీలో పర్యటించిన గూడెం మహిపాల్ రెడ్డి, పటాన్ చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్



**పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, జూన్ 7 :**
పటాన్ చెరు జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో, డిఫెన్స్ కాలనీలో ఆదివారం ఉదయం పటాన్ చెరు శాసనసభ్యులు శ్రీగూడెం మహిపాల్ రెడ్డి, పటాన్ చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ లు పర్యటించారు. ఈ కార్యక్రమంలో భాగంగ డిఫెన్స్ కాలనీలో మొక్కలు నాటారు. కాలనీ వాసులతో మాట్లాడుతూ కాలనీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గౌతమ్ నగర్ కాలనీలో ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ కాలనీవాసులతో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ఉన్న సమస్యలను ప్రణాళిక బద్ధంగా పూర్తి చేసి కాలనీవాసులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ విజయ్ , నారా బిక్షపతి , మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ గారు, పృథ్వీరాజ్ , ఖుషీ డిఫెన్స్ కాలనీ ప్రెసిడెంట్ అమరేందర్,అడ్వకేట్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉత్సాహంగా '5ఖ రన్

**మీడియా టుడే జిల్లా ప్రతినిధి**
**ఆదిలాలాబాద్ జూన్07**



ఆదిలాబాద్ జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉత్సాహంగా '5ఖ రన్ కార్యక్రమన్ని నిర్వాహించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన '5ఖ రన్' స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ , మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి,తో కలిసి ఎస్పి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యాయామాన్ని నిత్య జీవన చర్యలో ఒక భాగం చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి కలెక్టర్ చౌక్, రాంనగర్ అక్కడి నుండి తిరిగి స్టేడియం వరకు ఉత్సాహతంగా విజయవంతంగా సాగిన ఈ 5ఖ రన్ లో జిల్లా నలుమూలల నుండి వచ్చిన క్రీడాకారులు, యువత స్థానిక ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్రతిరోజూ రన్నింగ్ చేయడం వల్ల శరీరానికి ఎన్నో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని పేర్కొన్నారు. నేటి ఆధునిక కాలంలో ఆరోగ్యకరమైన జీవనం సాగించడం కోసం ప్రతి ఒక్కరూ వ్యాయామాలను తమ నిత్యజీవితంలో ఒక భాగంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. నిరంతరం శారీరక శ్రమ చేయడం ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం లభిస్తుందని, దీనివల్ల యువత సులభంగా చెడు అలవాట్లకు దూరంగా ఉండవచ్చని సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమ మానసిక, శారీరక ఆరోగ్య రక్షణ కోసం ప్రత్యేకంగా పాటుపడాలని కోరారు. ఇదే సమయంలో జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీస్ శాఖ తరపున తాము ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. యువత తప్పుడు మార్గాల్లో వెళ్లకుండా క్రీడలు, శారీరక శ్రమ వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు.ఈ 5ఖ రన్ పురుషుల కేటగిరీ లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా మాడవి భీమ్ రావ్, కె.ప్రణయ్, దక్ష్ మహిళల కేటగిరీ లోప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాల్లో పూజ, గంగోత్రి, వైశాలి విజేతలుగా నిలిచారు.వారికి ప్రథమ రూ.5000, ద్వితీయ రూ.3000, తృతీయ రూ.2000 నగదు బహుమతులు, తరువాతి విజేతలకు కన్సోలేషన్ బహుమతులతో పాటు మెడల్స్ లను ఎస్పీ, డిఎఫ్ఓ అందజేశారు.ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీనివాస్, ఎఫ్డీఓ అరవింద్, ఎఫ్ఆర్ఓలు రాథోడ్ అవినాష్, శీలానంద్, శ్రీనివాస్, అనిత, అటవీ, పోలీస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, క్రీడాకారులు, యువత, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఇస్నాపూర్ పెద్దమ్మ గుడి వద్ద షెడ్డు నిర్మాణానికి సొంత నిధులు వెచ్చిచ్చిన మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు



**ఇస్నాపూర్ ప్రతినిధి, మీడియా టుడే, జూన్ 7**
ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధి పెద్దమ్మ దేవాలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించ తలపెట్టిన షెడ్డు నిర్మాణ పనులకు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ శంకుస్థాపన చేశారు. ఆలయానికి వచ్చే భక్తులు ఎండకు, వానకు పడుతున్న ఇబ్బందులను గమనించిన స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు ఈ విషయాన్ని నీలం మధు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన, ప్రభుత్వ నిధుల మంజూరు ప్రక్రియ కోసం వేచి చూడకుండా, భక్తుల కష్టాలను తీర్చడమే ధ్యేయంగా తన సొంత నిధులతోనే ఈ షెడ్డు నిర్మాణాన్ని చేపట్టేందుకు ముందుకు వచ్చారు.ఆదివారం ఆలయ ప్రాంగణంలో కౌన్సెలర్ మల్లేశ్వరి కుమారుడు మణికంఠ నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న నీలం మధు, అమ్మవారికి ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం షెడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేసి శంకుస్థాపన చేసి నిర్మాణ వ్యయాన్ని నిర్వాహకులకు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు నీలం మధును శాలువాతో ఘనంగా సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్వరి మణికంఠ, కౌన్సిలర్స్ మన్నే రాఘవేంద్ర, వెంకటేష్ నాయక్, సంగన్నగారి గోపాల్, సందీప్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు రాఘవేంద్ర, శంకర్, సంజీవ, ఆంజనేయులు, కృష్ణ, రాజు, మున్సిపాలిటీ కాంగ్రెస్ ముఖ్య నాయకులు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

మీడియా టుడే

సోమవారం, జూన్ 8, 2026

## కల్కి ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తా: జగ్గారెడ్డి

సంగారెడ్డి జిల్లా,మీడియాటుడే బ్యూరో /జూన్8.



సంగారెడ్డి పట్టణంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో కల్కి భగవాన్ భక్త బృందం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కల్కి భగవాన్ కల్యాణ మహోత్సవంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కల్కి భగవాన్ దంపతుల విగ్రహాలకు పూలమాలలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రజలందరిపై కల్కి భగవాన్ కృపా కటాక్షాలు ఉండాలని, ప్రతి కుటుంబం సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రతీ ఏటా భక్తిశ్రద్ధలతో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న కల్కి భక్త బృందాన్ని అభినందించారు.కల్కి భగవాన్ ఆలయ నిర్మాణం కోసం స్థలాన్ని సేకరించినట్లు నిర్వాహకులు జగ్గారెడ్డి దృష్టికి తీసుకురాగా, ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కల్కి భక్త బృంద సభ్యులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ప్రతిష్టకు మరియు శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం నిర్మాణం కై విరాళం అందజేత

మీడియా టుడే (మహబూబాబాద్ జిల్లా జూన్ 07)



మహబూబాబాద్ జిల్లా గూడూరు గ్రామపంచాయతీ లో గౌడ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తలపెట్టిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ప్రతిష్టాపనకు మరియు రేణుక ఎల్లమ్మ దేవాలయ నిర్మాణం గూడూరు సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు 20016/- విరాళంగా అందజేసి వారి ఉదారత్వాన్ని చాటారు ఈ సందర్భంగా గౌడ కులస్తులు మరియు యువ నాయకులు వారిని అభినందించారు ఈ కార్యక్రమంలో బీరం శ్రీపాల్ రెడ్డి తో పాటు సర్వాయి పాపన్న గౌడ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కప్పల అనిల్ కిషోర్ గౌడ్ ఉపాధ్యక్షులు పానుగంటి రామకృష్ణ లతోపాటు గౌడ కుల పెద్దలు పానుగంటి వీరస్వామి సమ్మెట సాంబయ్య మెరుగు మల్లయ్య పంజాల రామస్వామి పొన్నం వెంకన్న బుర్ర జోగయ్య గోపగాని యాదగిరి గోడిశాల సారయ్య బాలగోని శ్రీధర్ కొయ్యడ సారంగపాణి గోపగాని శ్రీను తదితరులు పాల్గొన్నారు

## ఆహార భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు

**కలెక్టరేట్‌లో 'ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం'**

**ఫుడ్ సేఫ్టీ, ఖీశీఝుజ అవగాహన సదస్సుకు**

**160 మంది ఫుడ్ హ్యాండ్లర్లు, అంగన్‌వాడీ సిబ్బంది హాజరు**

నిజామాబాదు జూన్7 (మీడియా టుడే ప్రతినిధి)



ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఫుడ్ సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి (ఖీూ) నవిత పర్యవేక్షణలో స్థానిక ఐడీఓసీ (×ఋూజ) కాంప్లెక్స్ సమావేశ మందిరంలో ఆహార భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం,ఎఫ్ ఓ ఎస్ టి ఏ సీ శిక్షణా తరగతులను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న దాదాపు 160 మంది ఫుడ్ హ్యాండ్లర్లు (ఆహార నిర్వాహకులు), అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.నాణ్యమైన ఆహారమే లక్ష్యం! ప్రజలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆహారాన్ని తయారు చేసేటప్పుడు, పంపిణీ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ప్రమాణాల గురించి ఈ సందర్భంగా అవగాహన కల్పించారు.

## తల్లిదండ్రులు ,పిల్లలపై ఒత్తిడి పెంచ్చోద్దు

**శాలివాహన విద్యా శిరోమణి అవార్డు కార్యక్రమంలో**

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్**



నిజామాబాదు జూన్7 (మీడియా టుడే ప్రతినిధి):

తల్లిదండ్రులు విద్యార్థులపై ఒత్తిడి పెంచ్చోద్దని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. శాలివాహన ( కుమ్మర ) ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని అంబేద్కర్ భవన్లో విద్యార్థులకు విద్య శిరోమణి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పదో తరగతి, ఇంటర్మీడియట్ లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నతమైన లక్ష్యంతో ముందుకెళ్లాలని సూచించారు. జిల్లాకు దేశానికి మంచి పేరు తేవాలని చెప్పారు. విద్యను ఎవరు దొంగిలించే అవకాశం లేదని, విద్యతోనే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చున్నారు. ప్రధానంగా ప్రతి విద్యార్థి స్మార్ట్ ఫోన్లకు దూరంగా ఉండాలని, ఫోన్లతో మంచి ఎంతో చెడు కూడా అంతకు రెట్టింపు ఉంటుందన్నారు. కుమ్మర కులస్తులు రాజకీయంగా ముందుకు రావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, శాలివాహన కులస్తులకు ప్రత్యేక గుర్తింపునిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అవార్డులు అందజేశారు. అంతకుముందు విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కుమ్మర ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ భూపతి, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ రావు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సాయికుమార్, జిల్లా కనకం గంగాధర్, సంఘ సభ్యులు హనుమాన్లు విసిగిరి గంగారం, ఆర్ కే ప్రజాపతి, సిర్పూరు చిన్నయ్య, జిల్లా మాజీ అధ్యక్షులు చందూర్ బాబు, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీ నారాయణ, బీజేపీ నాయకులు పవన్ ముందడ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు నాణ్యతతో గడువు లోగా పూర్తి చేయాలి

**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క - రూ. 3.15 కోట్లతో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం**

**-రూ. 33 కోట్లతో రహదారుల అభివృద్ధి, జాతీయ రహదారుల అనుసంధాన పనులకు భూమిపూజ**

**50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఉపముఖ్యమంత్రి**



మీడియా టుడే ఖమ్మం ప్రతినిధి :

క్షేత్ర స్థాయిలో చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యతతో గడువులోగా పూర్తయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదివారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని ముదిగొండ మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు ఉప ముఖ్యమంత్రికి స్వాగతం పలికి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ముదిగొండ మండలంలోని యడవల్లి గ్రామంలో రూ.3.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు, ముదిగొండ మండల కేంద్రంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈఆర్‌వో కార్యాలయ భవనానికి, మండలంలో రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.33 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు రహదారుల అభివృద్ధి పనులకు కూడా ఉప ముఖ్యమంత్రి భూమిపూజ నిర్వహించారు. అనంతరం యడవల్లి లక్ష్మీపురం గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ముదిగొండ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని ఉప ముఖ్యమంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ సబ్‌స్టేషన్ అందుబాటులోకి రావడం ద్వారా పరిసర గ్రామాలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుందని, గ్రామ ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించేందుకు గ్రామ పంచాయతీ భవనం భవనం ఉపయోగపడనుందని తెలిపారు. ప్రజలకు విద్యుత్ సంబంధిత సేవలు మరింత సులభంగా అందించేందుకు ఈఆర్ఓ భవనం దోహదపడనుందని అన్నారు. ముదిగొండ మండలంలో 33 కోట్లతో చేపట్టిన రహదారుల నిర్మాణం పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగు పడటంతో పాటు జాతీయ రహదారులతో అనుసంధానం బలోపేతం కానుందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అన్నారు. ఆసుపత్రి భవన నిర్మాణ అన్ని పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి అయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిర్మాణ పనుల నాణ్యతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ నిర్వహించాలని, సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. పనుల పురోగతిపై నిరంతర సమీక్ష నిర్వహిస్తూ, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రజలకు మెరుగైన మౌళిక సదుపాయాలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సుడా ఛైర్మెన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఇతర స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమంలో ధూంధాం చేసిన గాయకుడు పెరుమాండ్ల శ్రీనివాస్

**సాంస్కృతిక సారథిలో ఉద్యోగం అవకాశం కోసం ఎదురుచూపు..**

**ప్రజా పాలన ప్రభుత్వం గాయకుడిని ఆదుకోవాలని విజ్ఞప్తి...**



మీడియా టుడే (మహబూబాబాద్ జిల్లా జూన్ 07)

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం పొనుగోడు గ్రామానికి చెందిన పెరుమండ్ల రామస్వామి, పద్మల, పెద్ద కుమారుడు పెరుమాండ్ల శ్రీనివాస్, చిన్నతనం నుండే కళా రంగం వైపు ఎక్కువగా ఇష్టపడేవాడు అతనికి ఐదవ తరగతి నుండి పాటలు పాడుతూ అతను జానపద సాంస్కృతిక పాటలు పాడుతూ తన గొంతును ఎక్కడ పడితే అక్కడ వినిపించేవాడు. తెలంగాణ మలిదశ ఉద్యమ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో తన పాటల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో గూడూరు మండలంలోనే ముందు వరుసలో ఉన్న ఉద్యమ గాయకుడు అతడే పెరుమాండ్ల శ్రీనివాస్. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం రిలే నిరాహార దీక్షలు, ధూమ్ దాం , ప్రజా గర్జన, సింహ గర్జన, సకల జనుల సమ్మె, వంట వార్పు, రైల్ రోకో, సాగర హారం, మిలియన్ మార్చ్, గుడి బందు, బడి బంధు లాంటి కార్యక్రమాలలో ముందు వరుసలో ఉన్న ఉద్యమకారుడు గాయకుడిగా గోసి గొంగడి ధరించి కాళ్లకు గజ్జలు కట్టుకొని తను పాడిన తెలంగాణ పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేసి ఎన్నో కష్టనష్టాలను అనుభవించిన పెరుమాండ్ల శ్రీనివాస్, ప్రతిభను గుర్తించిన గత ప్రభుత్వం గూడూరు మండల ఉత్తమ అవార్డు గ్రహీత గాయకుడిగా అతనికి 10,116 నగదు ప్రోత్సాహంతోపాటు సన్మానం చేయడం జరిగింది. తెలంగాణ ఉద్యమ సమయంలో పెరుమాండ్ల శ్రీనివాస్, రసమయి బాలకిషన్, విమలక్క, నేర్నాల కిషోర్, గిద్దె రాం నరసయ్య, గర్జన, అంతడుపుల నాగరాజు, దరువు అంజన్న, దరువు ఎల్లన్న, కొమ్మిరే వెంకన్న, యోచన, దారా దేవేందర్, బండ వెంకన్న, లాంటి గొప్ప కళాకారులతో ధూంధాం వేదికల మీద పాటలు పాడడం జరిగింది. పెరుమాండ్ల శ్రీనివాస్ హరితహారం మహిళలపై అత్యాచారాలు బడిబాట నిరుద్యోగ యువతకు శిక్షణ స్వచ్ఛభారత్ లాంటి కార్యక్రమాలపై పాటలు పాడుతూ ప్రజలను చైతన్యం చేయడం జరిగింది. గత ప్రభుత్వంలో తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగ అవకాశం కోసం అప్పటి చైర్మన్ రసమయి బాలకిషన్ ను, ఎన్నిసార్లు కలిసిన ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటి తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మరియు సాంస్కృతిక శాఖ మాత్యులు జూపల్లి కృష్ణారావు, చైర్మన్ గద్దర్ వెన్నెల, తెలంగాణ ఉద్యమకారుల చైర్మన్ కే కేశవరావు, కమిటీ సభ్యులు మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, లాంటి గొప్ప నాయకులు చొరవ తీసుకొని నిరుపేద కుటుంబానికి చెందిన ఉద్యమకారుడు ఉద్యమ గాయకుడు పెరుమాండ్ల శ్రీనివాస్ కు, సాంస్కృతిక సారథిలో ఉద్యోగ అవకాశం కల్పించాలని వేడుకుంటున్నాడు.

## 100 కేవీ విద్యుత్ ట్రాన్సఫర్మ్‌ను ప్రారంభించిన ఏఎంసిచైర్మన్ సీతారాములు

నేలకొండపల్లి జూన్ 7 మీడియా టుడే





నేలకొండపల్లి మండల పరిధిలోనికొత్త కొత్తూరు గ్రామంలో విద్యుత్ లోవోల్టేజ్ సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతుండగా ఈ సమస్యను తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణం మరియు సమాచార శాఖల మంత్రివర్యులు శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకవేళ్ళగా వెంటనే మంత్రి కొత్త కొత్తూరు గ్రామానికి 100 ఏవి ట్రాస్ఫర్మ్ ను మంజూరి చేయించినారు. విద్యుత్ ఏఈ రవి వెంటనే పనులు ప్రారంభచేయించి త్వరగా ట్రాన్స్ఫార్మర్ ను గ్రామంలో అమర్చినారు. ఆదివారంనూతన ట్రాన్స్ఫార్మర్ ను నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, సర్పంచ్ మాలోత్ కళావతి ప్రారంభచిన్నారు. ఈ కార్యక్రమం ఉపసర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, వార్డ్ మెంబెర్స్ బొల్లగాని వెంకటరామారావు, గుగులోత్ వెంకటి, ఠాగూర్ రాంసింగ్, విద్యుత్ ఏఇ జి.రవి, ఎస్ ఎల్ ఐరమేష్ బాబు, ఎల్ ఐ.సత్యనారాయణరెడ్డి, జేఎల్ఎం.సతీష్, సురేష్, అన్మాన్ రామకృష్ణ, గ్రామస్తులు మాలోత్ అయోధ్య రామయ్య, రావేళ్ళ జ్యోతిబాస్, వల్లాల కృష్ణ,రావేళ్ళ కోటేశ్వరరావు, చావా వెంకటేశ్వరావు,రావేళ్ళ రవి, మాలోత్ హనుమా, జాల నాగేశ్వరావు, కాకుమాని మల్లికార్జున రావు,చిక్కు సత్యనారాయణ ,జిక్కుల నాగేశ్వరావు,మూడు రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్త కొత్తూరు గ్రామస్తులు మంత్రిపొంగులేటి శ్రీనన్నకి, మంత్రి గారి క్యాంప్ కార్యాలయం ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి కి ధన్యవాదములు తెలియ జేశారు.

## ప్రతి కులం యొక్క కార్పొరేషన్ అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది

**రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని**

నిజామాబాదు జూన్7 (మీడియా టుడే ప్రతినిధి):




నిజామాబాద్ కు విచ్చేసిన రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు సాధారణంగా ఆహ్వానించి నిజామాబాద్ కార్పొరేషన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ.సన్మానించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలు అన్ని అభివృద్ధి చెందాలని ప్రతి కులం అభివృద్ధి చెందాలని ఆలోచనతో ఆయా కులాలకు కార్పొరేషన్ల చైర్మన్ లను నియమించింది. ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ వల్లనే సాధ్యమయ్యే పని అని, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఇద్దరి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలు అన్ని సంక్షేమ పథకాలు అందుకోవడం లో గాని, అభివృద్ధి జరగడంలో గాని ముందంజలో ఉంటాయని, ప్రతి కులం యొక్క కార్పొరేషన్ అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది అని ఆయన అన్నారు .ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు నగేష్ రెడ్డి,రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్, పంచాయతీ రాజ్ సంఘటన్ కమిషన్ మెంబర్ వేణుగోపాల్ యాదవ్, నుడా చైర్మన్ కేశవేణు, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్ ,జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విపుల్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ గౌడ్ ,మాజీ మేయర్ ఆకుల సుజాత, కార్పోరేటర్లు ప్రవీణ్ యాదవ్, నరేందర్, కో ఆప్షన్ నెంబర్ నరేంద్ర సింగ్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఘోరం వైద్యుల నిర్లక్ష్యానికి బాలిక బలి!

**కన్నపేగు తెగిన దుఃఖంలో కుటుంబం... కన్నీళ్లపై ఖాకీల బూట్ల గుర్తులు**

**మానవత్వం మరిచిన పోలీసులు నిరసనకారుల పై పోలీసుల లాఠీ-ఛార్జ్**

**రక్తాలు కారుతున్నా నిరసనకారులను జీపుల్లోకి తోసేసిన పోలీసులు!**



జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్లక్ష్యం మరోసారి బట్టబయలైంది.గద్వాల జిల్లా ఎర్రవల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని కడుపునొప్పితో శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య చికిత్స నిమిత్తం చేరుకోగా రాత్రి సమయంలో వైద్య అధికారులు అందుబాటులో లేకపోవడంతో వైద్య సిబ్బంది సరైన చికిత్స అందించలేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. శనివారం ఉదయం పరీక్షించిన డాక్టర్లు బాలికకు అపెండెక్స్ ఆపరేషన్ చేయాలని చెప్పి ఈసీజీ, సిటి స్కాన్, రక్తపరీక్షల అనంతరం బాలికకు కావలసిన వైద్య సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో బాలిక బంధువులు ప్రైవేట్ మెడికల్ షాప్ లలో కావాల్సిన వైద్యసామాగ్రిని తీసుకొచ్చి డాక్టర్లకు అందించిన అనంతరం సర్జరీ పేరుతో బాలికను తీసుకెళ్లిన వైద్యులు లో బీపీతో బాలిక మృతి చెందిందని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాలికకు సరైన వైద్యము డాక్టర్లు అందించకపోవడంతో మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు

**రోడ్డుపైకి బాధితులు -- ఖాకీల జులూం:**

కన్నబిడ్డను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులకు న్యాయం చేయాల్సింది పోయి, పోలీసులు అత్యుత్సాహం చూపి మానవత్వాన్ని మంటగలిపారు.మా పాప మరణానికి కారణమైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, ఉద్యమకారులు రోడ్డుపై నిరసనకు దిగారు. అయితే, అక్కడ శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు అత్యుత్సాహంతో నిరసనకారులపై లాఠీ ఝులిపించారు .రక్తాలు కారుతున్నా లెక్కచేయకుండా,మృతి చెందిన బాధితురాలి బంధువులను మద్దతు దారులను రోడ్డుపై ఈడ్చిపారేస్తూ బలవంతంగా జీపుల్లోకి ఎక్కించారు. గద్వాలలో ఏ నిరసన కార్యక్రమం జరిగినా పోలీసులు ఇంతే క్రూరంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండి పడుతున్నారు.

**గద్వాల ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారుల తీరు వేరు**

గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే వైద్యాధికారులు పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే బాధితులని వారి నర్సింగ్ హోమ్లకు రెఫర్ చేస్తున్నారని పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి

జిల్లా కలెక్టర్ స్థానిక ప్రజాప్రతినిధి పలుమార్లు హెచ్చరించిన వైద్యుల తీరు మాత్రం మారడం లేదు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కోట్లాది రూపాయల ఖర్చు చేస్తున్న తరుణంలో గద్వాల జిల్లాలో మాత్రం వైద్యులు వ్యవహరిస్తున్న తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి

**బాలిక మృతి పై విచారణ కమిటీ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

బాలిక మృతి పై నిజా నిజాలు నిర్ధారించేందుకు ఐదు మంది కమిటీ సభ్యులతో కమిటీని నియమించినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ విచారణలో వైద్యుల నిర్లక్ష్యంతో బాలిక మృతి చెందినట్లు ఆధారాలు లభిస్తే వెంటనే వారిపై చర్యలు తీసుకుంటానని అన్నారు. కమిటీలోని సభ్యులు విచారణలో ఔకతోకలకు పాల్పడినట్లు తెలిస్తే కమిటీపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడనని అన్నారు

**ఓట్లప్పుడే గుర్తొచ్చే ప్రజలు -- పాలకుల మౌనం:**

స్థానికంగా ప్రజల ఓట్లతో గెలిచి పీఠాలెక్కిన నాయకులు ఒక్కరు కూడా ఈ ఘటనపై నోరు మెదపకపోవడం గమనార్హం. "మాకెందుకులే పేదల ప్రాణాలు" అన్నట్లుగా ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారు.అని ప్రజలు చర్చించు కుంటున్నారు ఓట్ల సమయంలో వంద అబద్ధాలు చెప్పి లబ్ధి పొందే నాయకులు, ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే కనీసం పరామర్శించడానికి కూడా రాకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# మానసికంగా శారీరక ఎదుగుదలకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయి

**కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్.**

**చదువుతోపాటు విద్యార్థులు క్రీడలలో రాణించాలి సర్పంచ్ దున్న శ్రీనివాస్.**



**నడిగూడెం, జూన్ 07(మీడియా టుడే)-:**

చిన్నతనం నుండే విద్యార్థిని విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల మక్కువ ఏర్పరచుకొని క్రీడల్లో రాణించాలని శారీరకంగా మానసికంగా ఆరోగ్యం తో పాటు ఉద్యోగ పరంగా మనిషి ఎదుగుదలకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని కోదాడ వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ స్థానిక సర్పంచ్ దున్న శ్రీనివాసులు అన్నారు గత 40 రోజులుగా మండల కేంద్రంలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవికాల ఉచిత కబడ్డీ క్రీడల శిక్షణ ముగింపు కార్యక్రమం సందర్భంగా చైర్ పర్సన్ తిరుపతమ్మ మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా మొబైల్ గేమ్స్, టీవీలో సినిమా లకు, బైక్ మీద వెళ్లడం విద్యార్థులు అలవాటు పడి మైదానంలోకి వచ్చి క్రీడలు ఆడటం రన్నింగ్ వాకింగ్ చేయడం మానేశారన్నారు గతంలో ఎంతోమంది కబడ్డీ ,వాలీబాల్, క్రికెట్, చెస్, క్యారం బోర్డ్, కోకో లాంగ్ జంప్, ఐ జంప్ ,జావలింగ్ త్రో పాటు అనేక రకాల క్రీడలలో రాణించి గుర్తింపు పొంది ఎంతోమంది ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలతో పాటు ఇతర రంగాలలో రాణిస్తున్నరని అన్నారు . స్థానిక సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మైదానంలోకి వచ్చి క్రీడలు ఆడాలని విద్యార్థులను కోరారు. గ్రామం తో పాటు చుట్టుపక్కల ఉన్న గ్రామాలలో ఉన్న క్రీడాకారులకు శిక్షణకు వచ్చి క్రీడలతోపాటు ఉద్యోగాలలో రాణించటానికి ఎంతగానో కృషి చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు పల్లపు నాగేశ్వరావును చైర్ పర్సన్ మరియు గ్రామ సర్పంచ్ దున్న శ్రీనివాసులు అభినందించారు. క్రీడల ప్రోత్సాహానికి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని చైర్ పర్సన్, సర్పంచ్ తెలిపారు ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ దున్న శ్రీకాంత్ ఉపాధ్యాయులు మీరాజుద్దీన్ రియాజ్ ,ఇంతియాజ్ ,పల్లపు నాగేశ్వరరావు, గోపాల్,కరుణాకర్ విజయ్, దినేష్ , రియాజ్, హరీష్ మహేష్ ,గోపి, అంజి ,సమద్ శ్రీకాంత్, విశాల్, సతీష్, హరీష్ పాల్గొన్నారు

# ప్రజా పాలన - ప్రగతి నివేదిక బస్సు యాత్రకు గద్వాలలో ఘన స్వాగతం



నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డా. మల్లు రవి ఆదేశాల మేరకు, తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్‌పర్సన్, గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శ్రీమతి సరిత తిరుపతయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పాలన -- ప్రగతి నివేదిక బస్సు యాత్ర గద్వాల జిల్లా కేంద్రంలో అట్టహాసంగా సాగింది.గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీగా వైఎస్ఆర్ చౌక్ వరకు సాగిన ఈ బస్సు యాత్రకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి అపూర్వ స్వాగతం పలికారు. కాంగ్రెస్ జెండాలతో గద్వాల వీధులు కళకళలాడగా, పార్టీ నినాదాలతో జిల్లా కేంద్రం మారుమోగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల సంక్షేమం కోసం చేపట్టిన చర్యలను ప్రజలకు వివరించే లక్ష్యంతో ఈ యాత్ర నిర్వహించ బడింది. ప్రజా పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో వేగం, సంక్షేమంలో నిబద్ధతతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు వివరించారు. వైఎస్ఆర్ చౌక్ వద్ద నిర్వహించిన సభలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గద్వాల జిల్లా కేంద్రం జనసంద్రంగా మారి కాంగ్రెస్ పార్టీ బలాన్ని మరోసారి చాటిచెప్పింది. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప ఎ,జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు ఓబీసీ మాజీ చైర్మన్ నల్లారెడ్డి, గద్వాల మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గంజిపేట శంకర్, డీసీసీబీ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి , జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆర్. తిరుమలేష్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, తాజా మాజీ కౌన్సిలర్లు, వివిధ శాఖల చైర్మన్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతి నిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కాంగ్రెస్ కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు.

# పర్యావరణ పరిరక్షణకు సైకిల్ ను వినియోగించాలి



పర్యావరణ పరిరక్షణకు తక్కువ దూరాలకు వెళ్లే సమయంలో పెట్రోల్, డీజిల్ వాహనాలకు బదులుగా సైకిల్ వినియోగించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు.ఆదివారం ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా నిర్వహించిన "సండేస్ ఆన్ సైకిల్" కార్యక్రమంను గద్వాల ఇండోర్ స్టేడియం వద్ద నిర్వహించారు.ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగ్ రావు ఇండోర్ స్టేడియం వద్ద జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం సైకిల్ ర్యాలీ ఇండోర్ స్టేడియం నుండి ప్రారంభమై పాత బస్టాండ్, కృష్ణవేణి చౌక్, అంబేద్కర్ చౌక్ మీదుగా తిరిగి ఇండోర్ స్టేడియం వరకు సాగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ప్రజల్లో ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన పెంపొందించడానికి దోహదపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో సైక్లింగ్ మరియు వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం, ఫిట్ ఇండియా ఉద్యమం లక్ష్యాలను ప్రజల్లో విస్తృతంగా చాటి చెప్పేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి డివైఎస్ఓ రామలింగేశ్వర గౌడ్, కరాటే కోచ్ శ్రీహరి, ఫుట్‌బాల్ కోచ్ విజయ్, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు, యువత మరియు క్రీడాభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో యశ్వంత్ కుమార్



**నిజామాబాదు జూన్7 (మీడియా టుడే ప్రతినిధి)**

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో మల్లారం సిఎస్ఐ కు చెందిన యువకుడు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు చోటు సాధించాడు.సిఎస్ఐ చర్చికి చెందిన మరెల్లి యశ్వంత్ కుమార్ ఆన్లైన్ ద్వారా సంగీత శిక్షణ పొందాడు. అనంతరం 2,000 మంది సంగీత విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధుల పర్యవేక్షణలో గంటపాటు కీబోర్డ్ ప్లే చేసి ఈ ఘనత ను సాధించాడు.రికార్డ్స్ లో నమోదు చేసుకొని అధికారంగా సర్టిఫికెట్ అందుకున్నాడు.

# బడిబాట - భవితకు బాట కార్యక్రమం నిర్వహణ

**జనగామ జిల్లా కొడకండ్ల మీడియా టుడే జూన్ 07**



ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో నిర్వహిస్తున్న "ప్రొఫెసర్ జయ శంకర్ బడిబాట" కార్యక్రమం భాగంగా కొడకండ్ల మండలంలోని పాకాల గ్రామ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు అందే సుధాకర్ ప్రత్యేక చొరవతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రులను కలుసుకుని వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. "నేను ప్రభుత్వ టీచర్ని... మీ పిల్లలకు అక్షరాలు మాత్రమే కాదు, మంచి వ్యక్తిత్వం, విలువలు, జీవిత పాఠాలు నేర్పుతాను. మీ పిల్లలను నాకు అప్పగిస్తే వారిని ఈ దేశానికి గొప్ప పౌరులుగా తీర్చిదిద్దుతాను" అని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం, డిజిటల్ తరగతులు, ఇంగ్లీష్ మీడియంలో బోధన వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. "బడి అంటే భయం కాదు భరోసా... చదువు అంటే భారం కాదు వెలుగు... రండి ప్రభుత్వ బడికి, కలిసి చదువుదాం" అంటూ నినాదాలు చేశారు.ఒక్క విద్యార్థి భవిష్యత్తు మారితే అతని కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందని తల్లిదండ్రులకు హితబోధ చేశారు. గ్రామస్తుల్లో ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంపొందించడం లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, గ్రామ సర్పంచ్ తుడి అనూష యుగేందర్ రెడ్డి,వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కొప్పునూర్ ఎస్సీ బాలుర హాస్టల్లో నూతన విద్యార్థుల ప్రవేశానికి మరోసారి ఆహ్వానం

**మీడియా టుడే న్యూస్ చిన్నంబావి జూన్ 7**



చిన్నంబావి : మండల పరిధిలోని కొప్పునూర్ ఎస్సీ బాలుర హాస్టల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి 3 నుంచి 10 తరగతి వరకు చదివే నూతన విద్యార్థుల నుంచి హాస్టల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానించనైనది.అటు స్కూళ్లలో,ఇటు హాస్టల్లో నాణ్యమైన భోజనం తో పాటు,నాణ్యమైన చదువు అందించబడును .ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ఖచ్చితంగా అమలుపరచడం జరుగుతుంది.అందుకే,ప్రవేశం పొందగోరె విద్యార్థులు ఆధార్ ,కులం, ఆదాయం,రేషన్ కార్డు,రెండు పాసుపోర్టు సైజు ఫొటోలతో ఈనెల 15 వ తేది సోమవారం రోజున స్కూల్ మరియు హాస్టల్లో చేరవచ్చుని వనపర్తి జిల్లా సహాయ ఎస్సీ అభివృద్ధి అధికారి రవీందర్ రెడ్డి ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు.

# గుగ్గిళ్లలో కరీంనగర్ డైరీ నూతన పాలకవర్గం ఎన్నిక

## అధ్యక్షుడిగా కేడిక మధుసూదన్ రెడ్డి

**చిగురుమామిడి మండల రిపోర్టర్ : మీడియా టుడే , జూన్ 07 :**



సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ల గ్రామంలో కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో కేడిక మధుసూదన్ రెడ్డి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.సైట్ సూపర్ వైజర్ ధన్ రాజ్, డైరీ డైరెక్టర్లు,పాడి రైతుల సమక్షంలో నిర్వహించిన సమావేశంలో నూతన పాలకవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతనఅధ్యక్షుడు మాట్లాడుతూ పాడి రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ధన్‌రాజ్, డైరెక్టర్లు చాడ గోవర్ధన్ రెడ్డి, విస్వోజు సత్తయ్య, గూడ సంజీవరెడ్డి, తడిసిన రాజిరెడ్డి, కల్లూరి రాజయ్య,దూశెట్టి లింగారెడ్డి, దూశెట్టి నారాయణ రెడ్డి,కొంకటి రాజయ్య,చిట్టీ గంగయ్య, సెక్రటరీ మహేందర్ రెడ్డి పాడి రైతులు,తదితరులు పాల్గొన్నారు.

# మెదక్‌లో దారుణం

## కుటుంబ కలహాలతో మిలిటరీ ఉద్యోగి హత్య





**మెదక్ జిల్లా మీడియా ప్రతినిధి జూన్ 07:-**

మెదక్ జిల్లా కేంద్రంలోని మిలిటరీ కాలనీ లో మిలిటరీ ఉద్యోగి పొన్నం కుమార్ గౌడ్ (45) హత్యకు గురైన ఘటన చోటుచేసు కుంది. ఆయన మెదక్ మండలం ర్యాలమడుగు గ్రామానికి చెందిన కుమార్ గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి మిలిటరీ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆయనకు భార్య పద్మ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.సంఘటన స్థలానికి చేరుకున్న మెదక్ పట్టణ పోలీసులు మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పూర్తి వివరాలు వెల్లడిస్తామని మెదక్ పట్టణ సీఐ మహేష్ తెలిపారు


# ఉప్పల్‌లో బీఆర్ఎస్‌ను బలహీనపరుస్తున్నది ఎవరు

**ఎమ్మెల్యే బండారి తీరుపై అరటికాయల భాస్కర్ తీవ్ర విమర్శలు**

**- ఉప్పల్ 10వ డివిజన్ టీఆర్ఎస్ (బీఆర్ఎస్) కేడర్‌లో అసంతృప్తి స్వరాలు**

**- పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలను విస్మరించి కాంగ్రెస్ వర్గాలకు ప్రాధాన్యం ఇస్తున్నారంటూ ఆరోపణలు**

**- ఎమ్మెల్యే నిర్ణయాలు బీఆర్ఎస్‌కు కాకుండా కాంగ్రెస్‌కు రాజకీయంగా లాభం చేకూర్చేలా ఉన్నాయని విమర్శ**



**ఉప్పల్, జూన్ 7 (మీడియా టుడే ప్రతినిధి):**
ఉప్పల్ 10వ డివిజన్‌లో టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) పార్టీని బలోపేతం చేయడానికి ఎన్నో ఏళ్లుగా కష్టపడి పనిచేసిన కార్యకర్తలను పూర్తిగా విస్మరిస్తున్నారని, ఈ పరిస్థితి పార్టీ కేడర్‌లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోందని కంటెస్టెడ్ కార్పొరేటర్ అరటికాయల భాస్కర్ ఆరోపించారు. పార్టీకి అండగా నిలిచిన నిబద్ధత కలిగిన కార్యకర్తలకు గుర్తింపు లేకుండా, కాంగ్రెస్ అనుకూల వర్గాలకు ప్రాధాన్యం కల్పించడం వల్ల బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నాయని అన్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు బీఆర్ఎస్‌ను బలోపేతం చేసే దిశగా కాకుండా, కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా లాభం చేకూర్చే విధంగా ఉన్నాయని భాస్కర్ తీవ్రంగా విమర్శించారు. పార్టీని నమ్ముకుని సంవత్సరాలుగా కష్టపడిన నాయకులు, కార్యకర్తలను పక్కనబెట్టి ప్రత్యర్థి రాజకీయ శక్తులకు అవకాశాలు కల్పించడం వల్ల కేడర్‌లో ఆగ్రహం పెరుగుతోందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికై మూడు సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు కనిపించడం లేదని, మరోవైపు పార్టీ అంతర్గత వ్యవస్థను బలహీనపరిచే చర్యలు కొనసాగుతున్నాయని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా డివిజన్ ఇన్‌చార్జ్ వ్యవస్థను ప్రవేశపెట్టి కార్యకర్తలను వర్గాలుగా విభజించే ప్రయత్నం జరుగుతోందని, దీనివల్ల పార్టీ ఐక్యత దెబ్బతింటోందని అన్నారు. ఉప్పల్ 10వ డివిజన్‌ను బలమైన టీఆర్ఎస్ (బీఆర్ఎస్) కేంద్రంగా తీర్చిదిద్దిన కార్యకర్తల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను పార్టీ శ్రేణులు సహించబోవని భాస్కర్ హెచ్చరించారు. ఉప్పల్ నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులపై పార్టీ అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకుని సమగ్ర సమీక్ష నిర్వహించాలని, కేడర్ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## మిర్యాలగూడ అంజిరెడ్డి రివర్ హాస్పిటల్‌లో ఈఎస్ఐ సేవల కౌంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ, జూన్ 7 (మీడియా టుడే):**
మిర్యాలగూడ పట్టణంలోని ప్రముఖ కార్పొరేట్ వైద్యశాల అంజిరెడ్డి రివర్ హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన ఈఎస్ఐ ప్రత్యేక సేవల కౌంటర్ ను మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆదివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ యాజమాన్యం, వైద్య బృందం, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మిర్యాలగూడ పరిసర ప్రాంతాల్లోని వేలాది మంది కార్మికులు, ప్రైవేట్ ఉద్యోగుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని, వారికి అత్యాధునిక కార్పొరేట్ వైద్య సేవలను ఉచితంగా అందించేందుకు ఈ సరికొత్త ఈఎస్ఐ కౌంటర్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. గతంలో ఈఎస్ఐ సేవల కోసం కార్మికులు హైదరాబాద్ లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు మిర్యాలగూడ పట్టణంలోనే అంజిరెడ్డి రివర్ హాస్పిటల్ లో ఈ కౌంటర్ ఏర్పాటుతో స్థానికంగానే తక్షణ అత్యవసర వైద్యం అందుతుందని హర్షం వ్యక్తం చేశారు. ఈఎస్ఐ పరిధిలోకి వచ్చే కార్మికులు, వారి కుటుంబ సభ్యులు రూపాయి ఖర్చు లేకుండా ఇక్కడ నాణ్యమైన వైద్య




సేవలు పొందవచ్చు అన్నారు. ఈ సదుపాయాన్ని మిర్యాలగూడ ప్రాంతంలోని కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, హాస్పిటల్ మేనేజ్మెంట్ ప్రతినిధులు, ప్రముఖ డాక్టర్లు, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ వడ్డీ, ప్రైవేట్ చీటీ వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలి : రేణుక అక్షర మహిళా మండలి



**మణుగూరు, జూన్ 7(మీడియా టుడే):**
పినపాక నియోజకవర్గంలోని మణుగూరు మండలంలో అక్రమ వడ్డీ, ప్రైవేట్ చీటీ వ్యాపారాలు పెరిగిపోతున్నాయని రేణుక అక్షర మహిళా మండలి ఆందోళన వ్యక్తం చేసింది. అధిక వడ్డీలతో సామాన్యులు, వ్యాపారులు, నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండలి సభ్యులు పేర్కొన్నారు. కొంతమంది వడ్డీ వ్యాపారులు చెక్కులు తీసుకుని అధిక వడ్డీలకు రుణాలు ఇస్తూ బాధితులను వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ కారణంగా పలువురు ఆర్థికంగా నష్టపోయి గ్రామాలు విడిచి వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. కొందరు తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టవిరుద్ధంగా జరుగుతున్న వడ్డీ, చీటీ, ఫైనాన్స్ వ్యాపారాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు అండగా నిలిచి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. ఎవరైనా అక్రమ వడ్డీ వ్యాపారులు, ప్రైవేట్ చీటీ నిర్వాహకుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటుంటే తమను సంప్రదించాలని రేణుక అక్షర మహిళా మండలి పిలుపునిచ్చింది. బాధితుల సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైతే జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసి న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు ఎండీ షబానా, కోరి శ్యామల, బొడ్డు సౌజన్య, దేరంగుల సుజాత, రెడ్డిబోయిన రేణుక, బడిశా పార్వతి, హేమలత, సౌజన్య దాకూరి తదితరులు పాల్గొన్నారు.

# కో-లివింగ్ హాస్టళ్లపై కఠిన నియంత్రణ విధించాలి

**గచ్చిబౌలి ఘటనపై సమగ్ర న్యాయ విచారణకు ఏఐవైఎఫ్ డిమాండ్**

**ఉప్పల్, జూన్ 7 (మీడియా టుడే ప్రతినిధి):**
గచ్చిబౌలిలోని ఓ కో-లివింగ్ హాస్టల్‌లో యువతి మృతి చెందిన ఘటనపై సమగ్ర న్యాయ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఈ ఘటన కేవలం వ్యక్తిగత విషాదం మాత్రమే కాదని, రాష్ట్రంలో వేగంగా విస్తరిస్తున్న కో-లివింగ్ హాస్టల్ వ్యవస్థలోని లోపాలు, ప్రభుత్వ పర్యవేక్షణ వైఫల్యాన్ని బహిర్గతం చేసిందని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగాలు, విద్య, ఉపాధి కోసం గ్రామాలు, చిన్న పట్టణాల నుంచి హైదరాబాద్‌కు పెద్ద సంఖ్యలో యువత వలస వస్తున్న నేపథ్యంలో వారికి సురక్షితమైన, అందుబాటు ధరల వసతి సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వ వసతి గృహాల ఏర్పాటు కంటే ప్రైవేటు కో-లివింగ్ వ్యాపారాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల యువత భద్రత ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కో-లివింగ్ హాస్టళ్లలో నివసించే యువతకు తాము వ్యతిరేకం కాదని, అయితే భద్రతా ప్రమాణాలు, ప్రభుత్వ నియంత్రణ లేకుండా నడుస్తున్న వ్యవస్థను వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో వేల సంఖ్యలో కో-లివింగ్ హాస్టళ్లు, పేయింగ్ గెస్ట్ వసతి గృహాలు పనిచేస్తున్నప్పటికీ, అనేక చోట్ల అగ్నిమాపక భద్రత, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, మహిళల భద్రతా చర్యలు, సీసీ కెమెరా పర్యవేక్షణ, మానసిక ఆరోగ్య సహాయ వ్యవస్థలు వంటి కనీస ప్రమాణాలు కూడా అమలు కావడం లేదన్నారు. యువత భద్రత కంటే లాభాలకే ప్రాధాన్యం పెరుగుతోందని విమర్శించారు. ప్రత్యేకించి ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ఉద్యోగాల కోసం వచ్చిన యువత అధిక అద్దెలు, ఒత్తిడితో కూడిన జీవనం, సామాజిక ఒంటరితనం, భద్రతా సమస్యల మధ్య జీవించాల్సి వస్తోందన్నారు. యువత నివాస హక్కును వ్యాపారంగా మార్చే ధోరణిని ఖండించిన ఆయన, ప్రభుత్వ హాస్టళ్లు, మహిళా వసతి గృహాలు, యువజన వసతి కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. గచ్చిబౌలి ఘటనలో వ్యక్తిగత కోణంతో పాటు హాస్టల్ నిర్వహణ, భద్రతా ప్రమాణాలు, యాజమాన్య బాధ్యతలు, అధికారుల పర్యవేక్షణ అంశాలపై కూడా సమగ్ర విచారణ జరపాలని కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. యువత భద్రతకు సంబంధించిన సామాజిక సమస్యగా ఈ ఘటనను ప్రభుత్వం పరిగణించాలని కోరారు.




## బుద్ధ విహార్‌కు వచ్చి బుద్ధ వందనాలు చేయండి

**భైంసా జూన్ 07 మీడియా టుడే జిల్లా ప్రతినిధి**
భైంసా పట్టణం నర్సింహా నగర లోని ఉన్న బుద్ధ విహార్ లో ప్రతి ఆదివారం జరిగే బుద్ధ వందన కార్యక్రమానికి ప్రతి ఒక్కరు పాల్గొనాలని బౌద్ధ చార్య పాండురంగ్ జాదవ్ అన్నారు. విహార్ టీం ఆధ్వర్యంలో ఆదివారం బుద్ధ వందన నిర్వహించారు. అందరూ కలసి బుద్ధ మూర్తికి అంబేద్కర్ రమాబాయి చిత్రపటానికి కొవ్వొత్తులు వెలిగించి పువ్వులు వేసి బుద్ధ వందనాలు చేశారు. విహార్ కు వచ్చిన వాళ్లకు విశ్రాంతి ఉద్యోగి లోఖండే నంద ప్రకాష్ అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం హైదరాబాద్ పట్టణానికి చెందిన సురేష్ సరోదే యొక్క కీ.శే. కాంతాబాయి పేరు మీద బుద్ధ విహార్ అభివృద్ధి కోసం 25 వేలు రూపాయలు బుద్ధ విహార్ టీం సభ్యులకు అందించారు. దీంతో విహార్ టీం సభ్యులు కలసి సురేష్ సరోదే కు ప్రత్యేకంగా జై భీమ్ లు తెలియజేశారు.

# అంగన్వాడీలలో నాణ్యమైన పోషకాహారం అందించాలీ


**జిల్లా ఆహార భద్రత అధికారి సునీత**




**మీడియా టుడే జిల్లా ప్రతినిధి ఆదిలాలాబాద్ జూన్07**
. "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక", ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఆదివారం అంగన్వాడీ ఉపాధ్యాయులకు ఆహార భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆహార భద్రతాధికారి సునీత మాట్లాడుతూ, సమాజంలో చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం సందర్భంగా అంగన్వాడీ ఉపాధ్యాయులకు ఆహార నాణ్యత, భద్రతా ప్రమాణాలపై పూర్తి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వివరించారు. అంగన్వాడీ కేంద్రాలలో సరఫరా చేసే ఆహార పదార్థాల నిల్వ, వంట తయారీ విధానాలలో పరిశుభ్రత పాటించాలని స్పష్టం చేశారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని గుర్తుచేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యాలను సాధించడంలో భాగంగా, జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలో నాణ్యమైన ఆహార నియమాలు అమలయ్యేలా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని, భవిష్యత్తులోనూ ఇలాంటి మరిన్ని అవగాహన కార్యక్రమాల ద్వారా జిల్లాను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దుతామని ఆమె భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, అంగన్వాడి టీచర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో సీఎం పర్యటన సందర్భంగా రామంతాపూర్ డివిజన్ అధ్యక్షుడు వంగాల సంతోష్ గుప్తా హౌస్ అరెస్ట్

**ఉప్పల్, జూన్ 7 (మీడియా టుడే ప్రతినిధి):**



ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉప్పల్ భగాయత్‌లో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పనుల శంకుస్థాపనకు విచ్చేసిన సందర్భంగా బీజేపీ రామంతాపూర్ డివిజన్ అధ్యక్షుడు వంగాల సంతోష్ గుప్తాను పోలీసులు ఈ రోజు ఉదయం ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా వంగాల సంతోష్ గుప్తా మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రతిపక్ష నాయకులపై అక్రమ ఆంక్షలు విధిస్తోందని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకు పర్యటనలు, శంకుస్థాపనలకే పరిమితమైందని విమర్శించారు. ముందస్తు అరెస్టులు, హౌస్ అరెస్టులతో ప్రజా వ్యతిరేక విధానాలపై జరుగుతున్న పోరాటాలను అడ్డుకోలేరని, ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరంతరం ఎండగడతామని వంగాల సంతోష్ గుప్తా హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు ఉన్న హక్కులను హరించే ప్రయత్నాలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని ఆయన పేర్కొన్నారు.

## పటాన్ చెరులో తెలంగాణ రక్షణ సేన జెండా ఎగురవేసిన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**పటాన్ చెరు ప్రతినిధి, మీడియా టుడే, జూన్ 7**



పటాన్ చెరు పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు ఆమె వేసి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ తొలినాలలో కొందరు సమైక్యవాదులు తెలంగాణ ఎక్కడ ఉందని ప్రశ్నించినప్పుడు, సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలోని తెల్లాపూర్ గ్రామంలో తెలంగాణ పదం శిలాశాసనంపై ఉందని సగర్వంగా చెప్పినట్టు ఆనాటి గుర్తులను తెలియజేశారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ కడప గడపకు చేరేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలన్నారు. సామాజిక అంశాలపై పోరాటం చేయాలని సూచించారు. ఫ్రాష్ట్రశీశీ 3 : పటాన్ చెరులో పార్టీ జెండాను ఎగురవేస్తున్న కల్వకుంట్ల కవిత

## ప్రజలు జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి

**మీడియా టుడే ప్రతినిధి నిజామాబాద్ జిల్లా జూన్ 7 :**




ఆర్మూర్ పట్టణంలోని పెండింగ్ కేసులు సత్వర పరిష్కారం కోసం ఈనెల 20న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జ్ న్యాయమూర్తి శ్రీదేవి కోరారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ లోక్ అదాలత్ లో కేసులను పరిష్కరించుకోవాలని తమ సమయాన్ని, డబ్బులను ఆదా చేసుకోవాలని సూచించారు. రాజి కుదిరితే చెల్లించిన కోర్టు రుసుము కోర్టు ఫీజు తిరిగి చెల్లిస్తామని పేర్కొన్నారు. క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాల కేసులు, ఆస్తి విభజన కేసులు కుటుంబ పరమైన కేసులు, వైవాహిక జీవిత సంబంధిత కేసులు, బ్యాంకు రికవరీ చెక్ బౌన్స్ కేసులు, రోడ్డు ప్రమాదాలు ఇతర కేసులపై సంబంధించిన కేసులను ఇరుపక్షాల సమ్మతితో రాజితో పరిష్కారమయ్యే కేసులనుంటిని పరిష్కరిస్తామని సివిల్ జడ్జ్ న్యాయమూర్తి శ్రీదేవి తెలిపారు.

# ప్రీ ప్రైమరీ టీచర్, ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**- అర్హులైన మహిళా అభ్యర్థులు అవకాశం వినియోగించుకోవాలి**

**: ఎంఈఓ స్వర్ణజ్యోతి**



**మణుగూరు, జూన్ 7 (మీడియా టుడే):** మణుగూరు మండల పరిధిలోని కూనవరం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రీ ప్రైమరీ టీచర్, ఆయా పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి జి. స్వర్ణజ్యోతి తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రీ ప్రైమరీ విద్యా కార్యక్రమంలో భాగంగా ఈ తాత్కాలిక నియామకాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రీ ప్రైమరీ టీచర్ పోస్టుకు ఇంటర్మీడియట్, ఆయా పోస్టుకు 7వ తరగతి విద్యార్హత కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, విద్యార్హతల ధ్రువపత్రాల రెండు సెట్ల జిరాక్స్ కాపీలను గెజిటెడ్ అధికారితో ధృవీకరించి ఈనెల 8వ తేదీలోపు మండల విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.అదేవిధంగా కూనవరం ప్రాథమికోన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభించనున్న ప్రీ ప్రైమరీ ఇంగ్లీష్ మీడియం తరగతుల్లో తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పలు సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ స్వర్ణజ్యోతి విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం ఫోస్టాక్'శిక్షణకార్యక్రమం




**నేలకొండపల్లిజూన్ 7 మీడియా టుడే**

ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖమ్మం జిల్లా ఆహార భద్రత శాఖ ఆధ్వర్యంలో స్థానిక గాంధీచౌక్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో 'ఫోస్టాక్' శిక్షణ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు.ఆహార వర్తక,వ్యాపారులు, నిర్వాహకులు పాటించాల్సిన సురక్షిత ప్రమాణాలపై ఈ సందర్భంగా వారికి విస్తృత అవగాహనకల్పించారు. ప్రముఖుల సమక్షంలో అవగాహన సదస్సు?ఈ శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, వక్తలుగా ఫోస్టాక్ ట్రైనర్గా చెన్నయ్ కి చెందిన నాగలక్ష్మి, గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ లోకేష్, సీసీసీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కూర్వెళ్ల ప్రవీణ్, ఫుడ్ అనలిస్ట్ బిట్టా ప్రవీణ్ కుమార్,తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఆహార భద్రత, పరిశుభ్రత ప్రమాణాలు, ఆహార వ్యాపార సంస్థలుతప్పనిసరిగాపాటించాల్సిన నిబంధనలు మరియు వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణ ప్రాధాన్యతను వివరించారు. ఇకార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజరు, కార్యకర్తలు, ఫుడ్ హ్యాండ్లర్లు, ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు, హోటల్ మరియు రెస్టారెంట్ ప్రతినిధులకు అవగాహన కల్పించారు.?ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ అవగాహన పత్రాలను అందజేశారు. సదస్సు ముగింపులో వక్తలు మాట్లాడుతూ.సురక్షిత ఆహారంఆరోగ్యకరమైన జీవితం" అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. వ్యాపారులు, వినియోగదారులు అంతా కలిసి ఆహార భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆకాంక్షించారు.

# జాతీయ లోక్ అదాలకు సద్వినియోగం చేసుకోవాలి జిల్లా ఎస్పీ

**సామరస్య పరిష్కారమే శాశ్వత పరిష్కారం**

**మెదక్ జిల్లా మీడియా టుడే ప్రతినిది . జూన్ 7**




జూన్ 20న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుక కోవాలి.ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ పజలకు తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో న్యాయం అందించేందుకు నిర్వహించబడుతున్న జాతీయ లోక్ అదాలత్‌ను మెదక్ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో వివిధ రకాల పెండింగ్ కేసులు, ట్రాఫిక్ చలానాలు, రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్ కేసులు, కుటుంబ వివాదాలు, సివిల్ వివాదాలు తదితర అంశాలను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు.లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కారమైతే దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియ నుంచి ఉపశమనం లభించడంతో పాటు సమయం, ధనం ఆదా అవుతాయని పేర్కొన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివాదాలను సామరస్యపూర్వకంగా ముగించేందుకు ఇది మంచి అవకాశమని తెలిపారు.ప్రజలు తమ కేసులకు సంబంధించిన వివరాలను సంబంధిత కోర్టులు, న్యాయవాదులు లేదా పోలీసు అధికారులను సంప్రదించి లోక్ అదాలత్‌లో పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు .జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పరస్పర అవగాహనతో తమ వివాదాలను ముగించుకోవాలని ఎస్పీ కోరారు.

# సంగారెడ్డిలో ఘనంగా TRS 'జెండా పండుగ'

**ఉచిత విద్య, వైద్యమే మా లక్ష్యం -- కల్వకుంట్ల కవిత**



**సంగారెడ్డి జిల్లా, మీడియా టుడే బ్యూరో /జూన్7.**

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన (TRS పార్టీ ఆధ్వర్యంలో 'జెండా పండుగ' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ కలబ్ గూర్ దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ మహా జనసమీకరణ సభకు ముఖ్య అతిథిగా లికల్వకుంట్ల కవితలి హాజరై, పార్టీ జెండాను ఆవిష్కరించారు.

**చరిత్ర ఉన్న జిల్లా సంగారెడ్డి: యువత తెలుసుకోవాలి**

సభను ఉద్దేశించి కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లాకు ఘనమైన చరిత్ర ఉందన్నారు. 1969 తెలంగాణ ఉద్యమం ఈ గడ్డ పైనే రగిలి ఊపందుకుందని, ఆనాటి ఉద్యమ చరిత్రను నేటి యువత తప్పక తెలుసుకోవాలని పిలుపునిచ్చారు.గతంలో అస్సలు తెలంగాణ ఎక్కడ ఉంది? అని ప్రశ్నించిన వారికి తెల్లాపూర్ ఒక సజీవ సాక్ష్యంగా, ఆనవాలుగా నిలిచింది. తెలంగాణ రక్షణ సేన (TRS) ద్వారా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తాం. అభివృద్ధిని మరింత బలోపేతం చేస్తాం."

**కల్వకుంట్ల కవిత**

**విద్యా, వైద్య రంగాలు పూర్తిగా విఫలం**

రాష్ట్రంలో ఎన్నో పార్టీలు ఉన్నప్పటికీ, పేద, మధ్యతరగతి ప్రజల శ్రేయస్సు కోసమే తాము కొత్త పార్టీని స్థాపించాల్సి వచ్చిందని కవిత స్పష్టం చేశారు. గత 30 సంవత్సరాలుగా రాష్ట్రాన్ని ఏలుతున్న మూడు ప్రధాన పార్టీలు ప్రజలకు కనీస విద్యను అందించడంలో పూర్తిగా విఫలమయ్యాయని మండిపడ్డారు .ప్రభుత్వ ఆసుపత్రుల దుస్థితిపై ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ప్రమాదవశాత్తు ఎవరైనా ఆసుపత్రికి వెళ్తే.. ప్రభుత్వ దవాఖానాల్లో సూది ఉంటే దూది ఉండదు, దూది ఉంటే సూది ఉండని పరిస్థితి నెలకొంది. పిల్లలకు ఏం కావాలో తల్లులకే బాగా తెలుసు. అందుకే ఒక మహిళగా, రాష్ట్ర పిల్లల భవిష్యత్తు కోసం నేను ఈ ı=ూ పార్టీని స్థాపించాను" అని ఆమె పేర్కొన్నారు.

**తెల్లాపూర్ శాసనం సాక్షిగా హామీ..**

రాబోయే ఎన్నికల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే లిఉచిత విద్య, ఉచిత వైద్యంలి అందించడాన్ని ప్రజల హక్కుగా మారుస్తామని కవిత హామీ ఇచ్చారు. "ఒకవేళ మా ప్రభుత్వం వచ్చాక నేను ఇచ్చిన మాట తప్పితే.. నన్ను తెల్లాపూర్ శాసనం దగ్గరే కట్టేసి రాళ్ళతో కొట్టండి" అంటూ ఆమె భావోద్వేగ సవాల్ విసిరారు. 'పాంచజన్యం' సిద్ధాంతమే తమ ı=ూ పార్టీ సిద్ధాంతమని ఈ సందర్భంగా ప్రకటించారు.

**స్థానిక నాయకత్వంపై నిప్పులు..**

సంగారెడ్డి ప్రాంతంలో ఉన్న ల్యాండ్ మార్క్ ప్రాజెక్ట్ 'సింగూర్'ను పాలకులు పూర్తిగా పట్టించుకోకపోవడం వల్లే ప్రస్తుతం అది కుంగిపోయి ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక నాయకులపై విమర్శలు గుప్పిస్తూ.. "ఇక్కడ జగ్గారెడ్డి, దామోదర్, రఘునందన్ రావు లాంటి ఎందరో నాయకులు ఉన్నా ఎవరు ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. జహీరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్ విషయమై రఘునందన్ రావు నోరు మెదపడం లేదు" అని విమర్శించారు.అలాగే, ఆందోల్‌లో ఒక మంత్రి బావమరిది 200 ఎకరాల భూమిని కబ్జా చేసినా అడిగే నాథుడే లేడని, పటాన్‌చెరు మీూూ అసలు ఏ పార్టీలో ఉన్నారో కూడా ప్రజలకు తెలియడం లేదని ఎద్దేవా చేశారు. మన ప్రాంతాన్ని ప్రేమించే ప్రాంతీయ పార్టీ ద్వారానే అభివృద్ధి సాధ్యమని, ı=ూ పార్టీని ప్రజలు తమ 'ఇంటి పార్టీ'గా ఆదరించాలని కోరారు.

**భారీగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు**

ఈ జెండా పండుగ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ బాలయ్య, నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీనివాస్ రెడ్డి, ముఖ్య నాయకులు కరుణాకర్, నితిన్, శ్రీకాంత్, ఖణ= యువసేన అధ్యక్షులు గోపాల్ రెడ్డితో పాటు భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, మహిళలు, యువతీ యువకులు పాల్గొన్నారు. కార్యకర్తల కోలాహలం, జెండాల పండుగతో సంగారెడ్డి కేంద్రం బంతివనంగా మారింది.

# విశ్వశాంతి కై లోక కళ్యాణార్థమై శ్రీ శ్రీ కిట్టు గురుస్వామి ఆధ్వర్యంలో శ్రీ రుద్ర సహిత చండీ హోమం

**రంగారెడ్డి జిల్లా మీడియా టుడే ప్రతినిధి జూన్7**

అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి మరియు శ్రీ బాల శ్రీ శాస్త శ్రీ పీఠం సంయుక్తంగా నిర్వహించు శ్రీ రుద్ర సహిత చండీ హోమం శ్రీ శ్రీ కిట్టు గురుస్వామి ఆధ్వర్యంలో 25 -6- 2026 నుంచి 29 -6- 2026 వరకు జరుగును. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్నటువంటి చర్యలు కావచ్చు లేదా వాతావరణం లో వచ్చే మార్పులు కావచ్చు హైందవ సంస్కృతిలో మనకు ఋషులు లేక పెద్దలు కావచ్చు హోమాలు యాగాలకు అత్యున్నత స్థానం కల్పించారు ఈ హోమాధులను దృష్టిలో పెట్టుకొని సామాన్య ప్రజలకు దరిద్రం దూరం అయి మరియు ఆరోగ్యం కోసం కావచ్చు శుభ ఫలితాలను అందజేయడం కోసం బాలశాస్త్ర శ్రీ పీఠం ఆధ్వర్యంలో శ్రీ రుద్ర సంధి హోమం సహిత చండీ హోమం ప్రముఖ చారిత్రాత్మక అమ్మపల్లి నర్ కూడా దేవాలయం ఎదురుగా ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహం ఎదుట ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు ఈ పూజా కార్యక్రమంలో భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని చండీ దేవుని కృపకు పరమశివుని ఆశీస్సులకు పాత్రులు కాగలరని కోరుతున్నారు ఈ పూజా కార్యక్రమంలో లక్ష్మీ గణపతి హోమం అయ్యప్ప హోమం సుబ్రహ్మణ్యస్వామి హోమం నవగ్రహ భద్రకాళి హోమాలు జరగనున్నట్లు ఆయన వెల్లడించారు అఖిలభారత అయ్యప్ప దీక్షా సమితి పర్యవేక్షణలో శాస్త్రవేత్తంగా వేద పండితులు ద్వారా నిర్వహించబడుతుంది అను సూచించారు అన్ని రకాలు గాఅమ్మ వారి ఆశీర్వాదాలు ఉంటాయన్నారు. ఎక్కడైతే అమ్మవారి చండీయాగం జరుగుతుందో అక్కడ అమ్మవారు నెలకొని ఉంటారన్నారు.




# డంపింగ్ యార్డు వద్దు..ఐటీ కారిడార్ ముద్దు

**బిఆర్ఎస్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు ఎమ్మె సత్యనారాయణ.**

**డంపింగ్ యార్డు ఏర్పాటు ఉద్యమంలో బిఆర్ఎస్ ముందుంటుంది**

**బిఆర్ఎస్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ నేతలు..**

**సిద్దాపూర్ లో వంటా వార్పు కార్యక్రమం.**




డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా సిద్దాపూర్ లో ఆదివారం బిఆర్ఎస్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు ఎమ్మె సత్యనారాయణ ఆధ్వర్యంలో నేతలు వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానికులు ప్రతి ఇంటి నుండి బియ్యాన్ని తీసుకువచ్చి డంపింగ్ యార్డ్ ప్రతిపాదిత స్థలంలో వంటలు చేసి అక్కడే భోజనాలు చేశారు. ప్రాణాలు పణంగా పెట్టైనా సరే డంపింగ్ యార్డ్ ను అడ్డుకొని తీరుతామని ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక చేశారు.పార్టీలు కాదు ప్రాణాలు ముఖ్యం అని ఇతర పార్టీ నేతలకు సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాల కమిటీ అధ్యక్షులు ఎమ్మె సత్యనారాయణ మాట్లాడుతూ.. బిఆర్ఎస్ ప్రభుత్వం ఐటీ పార్క్ ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని అసైన్ భూములను టిజిఐఐసికి అప్పజెప్పితే కాంగ్రెస్ ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి ప్రజల జీవితాలను అంధకారం చేస్తే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఐటీ పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు వస్తాయి మా బతుకులు బాగుపడతాయి అని ఆశించిన యువత డంపింగ్ యార్డ్ ప్రకటనతో భయాందోళనలో ఉన్నారని అన్నారు.ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా డంపింగ్ యార్డ్ ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు.స్థానిక ప్రజలకు యువతకు నేను విజ్ఞప్తి చేస్తున్న పార్టీలకతీతంగా ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు కలిసి రావాలని అన్నారు.నలుగురుతో ప్రారంభమైన తెలంగాణ ఉద్యమం ఎలాగైతే రాష్ట్రాన్ని సాధించుకుందో డంపింగ్ యార్డ్ ను సైతం ఇక్కడి నుంచి పంపించేంతవరకు తమ పోరాటం ఆగదని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రజా ఉద్యమాలు చేపడితే పార్టీలకతీతంగా మద్దతు తెలిపి వారితో కలిసి పని చేస్తామని చెప్పారు.నేడు చుట్టూ ఉన్న 30 గ్రామాల ప్రజలు బిఆర్ఎస్ పార్టీతో కలిసి రావడానికి సిద్ధమవుతుంటే అధికార పార్టీ నాయకులు యువకులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందన్నారు. డంపింగ్ యార్డ్ వద్దనుకుంటే మాతో కలిసి రండి లేదా మీరు ప్రజా ఉద్యమాలు చేపడితే మీతో మేము కలిసి రావడానికి సిద్ధంగా ఉన్నాం.బిఆర్ఎస్ పార్టీ చేసే ఉద్యమాలను ప్రభుత్వం పోలీసులచే అడ్డుకునే ప్రయత్నం చేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ సలహాదారు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్,కన్వీనర్ లు బొజ్జ శ్రీనివాస్ రెడ్డి,వడ్డే బాలయ్య,నేతలు కడల శ్రీశైలం,నరేందర్ రెడ్డి,బాబు రాజు నాయక్,రెడ్యానాయక్,వడ్డే మల్లేష్,రాజు నాయక్,నాను నాయక్, జాంప్ల,చందర్ నాయక్, వడ్డే మహేష్, కుమ్మరిగూడెం పాండు ,జామ కాయల కృష్ణయ్య, ఎమ్మె రాఘవేందర్,గూడూరు శ్రీను,ఎమ్మె మల్లేష్, దండు తిరుపతయ్య, బుడుగు ఆంజనేయులు,యాదగిరి,గుని మహేష్, శ్రీనివాసు,ఎమ్మె జంగయ్య,అంబటి మల్లేష్,ఎమ్మె నరసింహ,ఎమ్మె కృష్ణయ్య, బీరప్ప,శ్రీకాంత్,ఐలేష్,ఆర్ల నరసింహ,జామకాయల నందు, సాయి,తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే ని కలిసిన పిసిసి కోఆర్డినేటర్

**జగిత్యాల మీడియా టుడే- జూన్ 7**

జగిత్యాల శాసన సభ్యులు డా. సంజయ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసిన పీసీసీ కో ఆర్డినేటర్, జగిత్యాల నియోజకవర్గం సర్ ప్రోగ్రాం మాస్టర్ ట్రైనర్ దర్శనం. వినోద్ కుమార్ గారు.ాఅతీ ప్రోగ్రాం ద్వారా చేపట్టబోవు కార్యక్రమం ను వివరించారు.ఈ కార్యక్రమం లో డీసీసీ అధ్యక్షులు గాజెంగి. నందయ్య పీసీసీ సభ్యులు నాగభూషణం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త మోహన్, కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, సీనియర్ నాయకులు దామోదర్ రావు, సమిండ్ల.శ్రీనివాస్,మైనారిటీ కాంగ్రెస్ అధ్యక్షులు మన్సూర్,కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ముకేష్ కన్నా,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బీరం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**రాయికల్-మీడియా టుడే-జూన్ 7:**
రాయికల్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరంలో పదవతరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. రెండు దశాబ్దాల కాలం తర్వాత కలుసుకున్న చిన్ననాటి మిత్రులు గత స్మృతులను నెమరువేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు పొన్నం రమేష్ మాట్లాడుతూ సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడిపే స్థాయికి విద్యార్థులు ఎదగడం గర్వకారణంమని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గుర్రం రజిత, రాణవేణి, గంగమణి, ఇంద్రాల రజని, బైరి శ్రీకళ, మచ్చ ప్రత్యక్ష, రాధ, రాజ్యలక్ష్మి, ఉడత మానస తదితరులు పాల్గొన్నారు.

## స్మశానవాటికకు శాశ్వత స్థలం కేటాయింపు

### స్మశాన వాటికలో బోర్ వెల్ ఏర్పాటు



**మీడియా టుడే మధిర:**
స్మశాన వాటిక స్థలం ప్రక్రియకు శాశ్వత పరిష్కారం తీసుకున్నట్లు స్థానిక అధికారులు స్పష్టం చేశారు. మధిర పట్టణంలోని విద్యుత్తు కార్యాలయం పక్కన స్మశాన వాటికకు ఉత్తరాన ఉన్న పాత స్మశాన వాటిక స్థలం కేటాయించిన నేపధ్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత, మున్సిపల్ కమిషనర్ సామ్యూల్ బెనడిక్ట్ ఇస్రాయిల్ ఫాల్,మధిర పట్నం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తలుపులు వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పారుపల్లి విజయకుమార్, డెవలప్మెంట్ కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆదివారం ఆ స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంత్యక్రియలు కార్యక్రమాలు నిర్వహించేందుకు విద్యుత్ కార్యాలయం పక్కన స్మశాన వాటికి ఉత్తరాన ఉన్న స్థలాన్ని సమాధుల కోసం శాశ్వతంగా కేటాయించినట్లు వారు తెలిపారు.ఆక్రమణలకు తావు లేకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు నీటి వసతి కోసం బోర్ వెల్ పనులు కూడా చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. సమాధులు ఏర్పాటుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి స్థలాన్నికి అన్ని అంగులు ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, మిర్యాల వెంకటరమణ గుప్తా, తన్నీరు రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు సామినేని రామనాథం తదితరులు పాల్గొన్నారు

## పోచమ్మ తీర్థాలు



**రాయికల్-మీడియా టుడే-జూన్ 7:**
రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామంలో పద్మశాలి సేవా సంఘం అధ్వర్యలో ఆదివారం పోచమ్మ తీర్థాలు నిర్వహించారు. డప్పు చప్పుళ్లతో, బోనాలతో తీర్థాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు కటుకం సతీష్, కోశాధికారి బోగ సత్తయ్య, ప్రదానకార్యదర్శి వాసాల రమేష్, మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, మార్కండేయ యూత్ అధ్యక్షులు జక్కుల సాగర్, సంఘ నాయకులు బోగ వెంకటేశం, మామిడాల నర్సయ్య, పురుషోత్తం, రాజు, వెంకటాద్రి, ప్రసాద్, మధు, రమేష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**రాయికల్-మీడియా టుడే-జూన్ 7:**
రాయికల్ మండలం ఉప్పుమడుగు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్ నర్సింగ్ సబ్జెక్టు బోధించుటకు పిజిసిఆర్టి నర్సింగ్ గెస్ట్ లెక్చరర్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ శోభారాణి తెలిపారు. బిఎస్సి నర్సింగ్ ఉత్తీర్ణులై బోధనా అనుభవం ఉన్న వాళ్లకి ప్రాధాన్యత ఇవ్వబడునని... జూన్ 11 సాయంత్రం 4:30గంటల లోపు ఆసక్తి గల వారుదరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# వెల్లటూరు గ్రామంలో బూజల అక్కిరెడ్డి కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహణ

**-ఉమ్మడి కుటుంబ బంధాలకు నిలువెత్తు నిదర్శనం - ఐదు తరాల కుటుంబ సభ్యుల సందడి**





**మీడియా టుడే న్యూస్ చిన్నంబావి జూన్ 7**
వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం వెల్లటూరు గ్రామంలో స్వర్గీయ బూజల అక్కిరెడ్డి -- నర్సమ్మ దంపతుల జ్ఞాపకార్థం నిర్వహించిన కుటుంబ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగవుతున్న ప్రస్తుత కాలంలో కుటుంబ బంధాలు, అనుబంధాలు, ప్రేమాభిమా నాలను భావితరాలకు పరిచయం చేయాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.అక్కిరెడ్డి -- నర్సమ్మ దంపతుల ఐదుగురు కుమార్తెల కుటుంబాలకు చెందిన ఎనిమిది మంది మగ పిల్లలు ఐదు మంది ఆడపిల్లలు ఐదు తరాల సభ్యులు ఈ సమ్మేళనంలో పాల్గొని కుటుంబ ఐక్యతను చాటిచెప్పారు. మొత్తం 128 మంది కుటుంబ సభ్యుల్లో 110 మందికి పైగా హాజరై బంధుత్వాల మాధుర్యాన్ని ఆస్వాదించారు. అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో స్థిరపడిన కొందరు కుటుంబ సభ్యులు అనివార్య కారణాలతో హాజరు కాలేకపోయినా, తమ శుభాకాంక్షలను పంపించారు.కార్యక్రమం ప్రారంభంలో స్వర్గీయ అక్కిరెడ్డి -- నర్సమ్మ దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ పెద్దలు మాట్లాడుతూ కుటుంబ విలువలు, పూర్వీకుల ఆశయాలు, పరస్పర ప్రేమాభిమానాల ప్రాధాన్యతను వివరించారు. ఉమ్మడి కుటుంబాల గొప్పతనాన్ని గుర్తుచేస్తూ, భావితరాలకు కుటుంబ బంధాల విలువను తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ప్రస్తుతం బిజీ జీవితంలో బంధువులను కలవడం అరుదైపోయిన నేపథ్యంలో సంవత్సరానికి కనీసం రెండు రోజులు అందరూ ఒకే చోట చేరి ఆప్యాయతలను పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. అలాగే చిన్నారులు, యువత, మహిళలు, పెద్దలు కలిసి కుర్చీలాట, వినోదాత్మక ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని సందడి చేశారు. డీజే పాటలకు యువత, కుటుంబ సభ్యులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ వేడుకకు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చారు. విజేతలకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యుడు జగ్గారి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, "ఉమ్మడి కుటుంబాల సంస్కృతి నేటి సమాజంలో క్రమంగా కనుమరుగవుతోంది. తాత, అమ్మమ్మ, నానమ్మ, మామ, అత్త వంటి బంధాల విలువను పిల్లలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. కుటుంబ సభ్యులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి బంధాలను మరింత బలోపేతం చేయడమే మా లక్ష్యం" అని అన్నారు.రెండో ఏడాదిలోకి అడుగుపెట్టిన ఈ ఆత్మీయ సమ్మేళనం కుటుంబ ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. గ్రామస్థులు, బంధుమిత్రులు, ఆహ్వానితులు కార్యక్రమాన్ని అభినందిస్తూ ప్రతి కుటుంబం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి బంధాలను సజీవంగా ఉంచాలని సూచించారు.కార్యక్రమం అనంతరం సామూహిక భోజనాలు ఏర్పాటు చేసి ఆత్మీయ వాతావరణంలో సభను ముగించారు.ఈ కార్యక్రమంలో ఆర్. వెంకట్రామ్ రెడ్డి, మధు భాస్కర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, జగ్గారి శ్రీధర్ రెడ్డి, జగ్గారి శ్రీకాంత్ రెడ్డి, జగ్గారి శ్రీనాథ్ రెడ్డి, ఏ. పురంధర్ రెడ్డి, ఏ. శివానంద రెడ్డి, ఏ మాధవరెడ్డి. కే. వెంకట కృష్ణారెడ్డి, కే. మహేశ్వర్ రెడ్డి, పి. శేషి రెడ్డి, కే. బాలస్వామి రెడ్డి తదితర కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు."ఆస్తులు కాదు... ఆప్యాయతలే కుటుంబానికి అసలైన సంపద అని చాటిచెప్పిన అక్కిరెడ్డి కుటుంబ ఆత్మీయ సమ్మేళనం ఉమ్మడి కుటుంబ బంధాలకు చిరస్మరణీయ వేదికగా నిలిచింది."

# ప్రీప్రైమరీటీచర్,ఆయాపోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**అర్హులైనమహిళాఅభ్యర్థులు దరఖాస్తులుచేసుకోవాలి**

**నేలకొండపల్లి మండల అభివృద్ధి అధికారి చలపతిరావు**



**నేలకొండపల్లి జూన్ 7 (మీడియా టుడే):**
నేలకొండపల్లి మండల పరిధిలోని భైరవునిపల్లి. రాయగూడెం. చెరువు మాదారం. పైనంపల్లి.సింగారెడ్డిపాలెం.నాచేపల్లి.ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రీ ప్రైమరీ టీచర్, ఆయా పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నేలకొండపల్లి మండల విద్యాశాఖ అధికారి. చలపతిరావు .తెలిపారు .తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రీ ప్రైమరీ విద్యా కార్యక్రమంలో భాగంగా ఈ తాత్కాలిక నియామకాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రీ ప్రైమరీ టీచర్ పోస్టుకు ఇంటర్మీడియట్, ఆయా పోస్టుకు 7వ తరగతి విద్యార్హత కలిగి ఉండాలని తెలిపారు.అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలని స్పష్టం చేశారు.దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, రెండు పాస్పోర్ట్ సైజు ఫొటోలు, విద్యార్హతల ధ్రువపత్రాల రెండు సెట్ల జిరాక్స్ కాపీలను గెజిటెడ్ అధికారితో ధృవీకరించి ఈనెల 8వ తేదీలోపుమండలవిద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. టీచర్ పోస్టుకు ఎనిమిది వేల రూపాయలు. ఆయా పోస్టుకు 6000 రూపాయలు గౌరవ వేతనం ఉంటుందని ఆయన చెప్పారు.

# రాజీవ్ సగృహ ధరణి టౌన్షిప్‌లో సత్వరమే మౌలిక వసతులు కల్పించాలి




**మీడియా టుడే, కామారెడ్డి, జూన్ 7:**
కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శుభం కన్వెన్షన్ లో ఆదివారం రాజీవ్ సగృహ ధరణి టౌన్షిప్ ప్లాట్ యజమానులు సమావేశమై వారికి కావాల్సిన కనీస అవసరాల పట్ల సమష్టిగా ఇష్టాగోష్టి నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వము 2022 సంవత్సరం నుండి 5 దఫాలుగా ధరణి వెంచర్ లో ఓపెన్ యాక్షన్ ద్వారా ప్లాట్లు అమ్మడం వలన 350 పైగా ప్లాట్లను యజమానులు కొనుగోలు చేసినారు. దాదాపు 50 కోట్ల రూపాయలు ప్రభుత్వానికి ప్లాట్ల ద్వారా ఆదాయం సమకూరింది. ప్రభుత్వ అధికారులు వేలం ప్రకటన సమయమున ఆరు నెలల్లో కనీస సదుపాయాలు అన్ని కల్పిస్తామని హామీ ఇవ్వడంతో పాటు అందరికీ ఆయా ప్లాట్ల పట్ల ఆసక్తి కలిగేలా అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చినారు. కానీ నాలుగు సంవత్సరాల నుండి ఇప్పటివరకు వెంచర్ లో కనీస మౌలిక సదుపాయాలు అయినటువంటి విద్యుత్ శక్తి, మంచినీరు, బి.టి రోడ్లు, మురుగు నీటి కాలువలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, వీధి దీపాలు పార్కులు మొదలైన వసతులు కల్పించక పోవడంతో తమను మోసం చేసిందని వాపోతున్నారు. వేలంపాటలో ఇండ్లు, ప్లాట్లు కొన్న బాధితులు బ్యాంకులలో ఈఎంఐ లు కట్టలేక, సొంత ఇండ్లు లేక రూపాయి రూపాయి కూడబెట్టిన డబ్బులతో సొంతింటి కల నెరవేరుతుందని ప్రభుత్వ వెంచర్ అనే నమ్మకంతో కొన్నడంతో అటు లోన్లు కట్టలేక ఇటు బయటకిరాయి కట్టుకుంటూ అత్యంత క్లిష్ట పరిస్థితులలో ఆర్థికంగా కుంగి పోతూ ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని అంతే కాకుండా ఇటు మున్సిపాల్టీ నుండి వీ ఎల్ టి, ఇంటి పన్నులు సైతం చెల్లించాల్సి వస్తుందని, అది కూడా మాకు భారంగా మారిందని వాపోతూ తక్షణమే ప్రభుత్వం ధరణి వెంచర్లో కనీస మౌలిక వసతులు వెంటనే ఏర్పాటు చేయాలని వెంచర్ గౌరవాధ్యక్షులు కైలాస్ రాజేశ్వర్, అధ్యక్షులు రాజనర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి జస్వంత్ రావు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ, శివ రాజయ్య, కేదార్నాథ్, శ్రీధర్, అనిల్, మోహన్ రెడ్డి, భుజంగరావు, రాజగంభీర్ రావు తో పాటు వెంచర్లోనీ ప్లాట్ లు, ఇళ్ళ యజమానులు పాల్గొన్నారు.

# విజయవంతంగా సమ్మర్ కోచింగ్ ముగిసింది

**మామిడి శెట్టి రవీందర్ కోచ్**



**భూపాలపల్లి / గణపురం మీడియా టుడే జూన్ 7**
గణపురం మండలంలో యువజన క్రీడల శాఖ అధికారి చిర్ర రఘు ఆదేశాలతో గణపురం మండలంలో బాల్ బ్యాడ్మింటన్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ను కోచ్ మామిడిశెట్టి రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ బాల్ బ్యాట్మెంటన్ సమ్మర్ కోచింగ్ కు యువ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సమ్మర్ కోచింగ్ లో భాగంగా క్రీడాకారులకు వివిధ మండలాలలో బాల్ బ్యాట్మెంటన్ క్యాంపులకు హాజరై అక్కడ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అదేవిధంగా క్రీడా ప్రాంగణంలోని పరిసరాలను, కోటగుళ్లలో పరిసరాలను శుభ్రం చేయడం జరిగింది. ఈ సమ్మర్ క్యాంప్ 45 రోజులు ఎంతో ఉత్సాహంగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోచ్ రవీందర్ మాట్లాడుతూ క్రీడాకారులు ఈ క్యాంపును విజయవంతం కావడానికి సహకరించిన గణపురం గ్రామ సర్పంచ్ కటుకూరి రాధిక శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఓరుగంటి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి చోటే మియా, క్రీడాకారులకు బాలు అందించిన సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు చిట్టి రెడ్డి, నేషనల్ క్రీడాకారుడు సతీష్, వార్డు సభ్యులు, కోడెపాక అనిల్, పసునూటి సౌమ్య శంకర్, బాల్ బ్యాట్మెంటన్ జిల్లా ప్రెసిడెంట్ గూట్ల తిరుపతి,క్రీడాకారులు సతీష్, వెంకన్న, రాజు, మల్లేష్, స్వామి, దుర్గయ్య వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగాఈ క్యాంపు ప్రతి ఆదివారం ఉచితంగా ఉంటుందని ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 7గంటల నుండి 10 గంటల వరకు గణపురం లోని ఎంపీపీ ఎస్ పాఠశాలలో హాజరు కాగలరని పూర్తి వివరాలకు 9030 93 66 15 నెంబర్ కు సంప్రదించగలరని కోచ్ రవీందర్ తెలిపారు.

# ‘సర్’లో అనుమానిత విదేశీయులపై కన్ను!

**అలాంటి కేసులను గుర్తిస్తే.. సంబంధిత అధికారులకు తెలియజేయండి**

**రాష్ట్రాల యంత్రాంగాలకు ఈసీ ఆదేశాలు**

**న్యూఢిల్లీ, జూన్ 7:**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రాల యంత్రాంగాలకు కీలక ఆదేశాలు జారీచేసింది. సర్ ప్రక్రియ చేపట్టే సమయంలో ఎవరైనా అనుమానిత విదేశీయులను గుర్తిస్తే.. అలాంటి కేసులను పౌరసత్వ చట్టం-1955 కింద పనిచేసే సంబంధిత అధికార యంత్రాంగానికి తెలియజేయాలని పేర్కొంది. ఈ విషయంలో అసిస్టెంట్ ఈఆర్వోలు ఈఆర్వో అధికారాలను స్వతంత్రంగా వినియోగించుకోవాలని స్పష్టం చేసింది. అదేవిధంగా ఎవరివైనా ఎన్యూమరేషన్ పత్రాలు తిరిగి రాకుంటే, బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) స్థానిక ఓటర్లను విచారించడం ద్వారా అందుకు గల కారణాలను (అందుబాటులో లేకపోవడం, నివాసం మారడం, మరణించడం, డబుల్ ఎంట్రీ వంటివి) గుర్తించి, నోట్ చేయాలని పేర్కొంది. ఈ మేరకు సర్ సమయంలో అనుసరించాల్సిన విధానాలపై ఈసీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులకు గత నెల 14న వివరణాత్మక కీలక మార్గదర్శకాలు జారీచేసిందని వార్తా సంస్థ పీటీఐ పేర్కొంది. గతేడాది బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కోసం ఈసీ సన్నాహాలు చేస్తుండగా.. బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్‌లకు చెందిన పలువురిని క్షేత్రస్థాయి సిబ్బంది గుర్తించినట్లు ఎన్నికల అధికారులు నివేదించారు. అయితే చివరికి, ఓటర్ల జాబితాలో ఉండేందుకు అర్హత లేని



అటువంటి వ్యక్తులకు సంబంధించిన ఎలాంటి గణాంకాలను కానీ, ఆధారాలను గానీ ఎన్నికల అధికారులు వెల్లడించలేదు. బీజేపీ, ఆ పార్టీ మిత్రపక్షాలకు అనుకూలంగా లేని ఓటర్లు లక్ష్యంగా సర్ ప్రక్రియను చేపట్టేందుకు ఈసీ చేస్తున్న ప్రయత్నాల్లో భాగమే ఇటువంటి వాదన అని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈసీ ఏపీ, తెలంగాణ సహా 16 రాష్ట్రాలు, 3 యూటీల్లో సర్ మూడో దశను గత నెల 14న ప్రారంభించిన విషయం తెలిసిందే. మే 30 నుంచి 36.73 కోట్ల ఓటర్లకు సంబంధించిన ప్రక్రియను దశలవారీగా చేపట్టింది.

# అమెరికా తరహా వైద్య సేవలు ఇక్కడా ఉన్నాయి

**చికిత్స కోసం అక్కడికి వెళ్లేందుకు ఓ కేసులో నిందితుడి విజ్ఞప్తికి సుప్రీం నో**

**తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు రద్దు**

**న్యూఢిల్లీ, జూన్ 7**
చికిత్స కోసం అమెరికా వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలంటూ ఒక కేసులో నిందితుడు చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. అమెరికా తరహా వైద్య ౖసవలు మనదేశంలోనూ అందుబాటులో ఉన్నాయని వ్యాఖ్యానించింది. అతడి పేరు గునిగటి రవీందర్ రావు. తన తండ్రి అనుమానాస్పద స్థితిలో మరణించారంటూ శీస సంతోష్ 2014 అక్టోబరు 12న పోలీసులకు ఫిర్యాదు చేయగా ప్రాథమిక విచారణ అనంతరం పోలీసులు నిందితుడు రవీందర్ రావుపై ఐపీసీ సెక్షన్లు 120-బి, 306 రెడ్ విత్ 34 కింద(ఆత్మహత్యకు ప్రేరేపించడం) ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 2016 ఫిబ్రవరి 29న చార్జ్‌షీట్ దాఖలు చేశారు. రవీందర్ రావు విచారణకు హాజరు కాకపోవడంతో నాన్-బెయిలబుల్ వారెంట్, లుక్ అవుట్ నోటీసు జారీ అయ్యాయి. 2016లో లుక్ అవుట్ నోటీసును సస్పెండ్ చేస్తూ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఆసరాగా తీసుకుని.. 2017లో అతడు అమెరికా వెళ్లిపోయాడు. అనంతరం 2025 ఏప్రిల్ 19న శంషాబాద్ విమానాశ్రయంలో దిగగానే పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. ఆ తర్వాత బెయిల్‌పై విడుదల అయ్యాడు. నిందితుడు తన పాస్‌పోర్టును తిరిగి ఇవ్వాలని కోరగా మేజిస్ట్రేట్ కోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. దీనిపై తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా మేజిస్ట్రేట్ కోర్టు ఉత్తర్వులను కొట్టివేస్తూ రవీందర్ రావు తిరిగి అమెరికా వెళ్లేందుకు అనుమతి ఇచ్చింది. హైకోర్టు తీర్పును శీస సంతోష్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్త, జస్టిస్ సతీశ్ చంద్రశర్మలతో కూడిన ధర్మాసనం కీలక తీర్పు ఇచ్చింది. అంతేకాదు.. ఈ కేసులో చార్జ్‌షీట్



దాఖలై పదేళ్లు గడుస్తున్నా, నేటికీ విచారణ ప్రాథమిక దశలోనే ఉండడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. “ఈ కేసు జరిగిన తీరును(క్రోనాలజీ) గమనిస్తే.. నిందితుడు ప్రతి దశలోనూ ఏదో ఒక కోర్టు గడప తొక్కుతూ విచారణ సాగకుండా అడ్డుకున్నాడనేది స్పష్టంగా కనిపిస్తోంది. 2016లో లుక్ అవుట్ సర్క్యులర్ సస్పెండ్ చేస్తూ వచ్చిన కోర్టు ఉత్తర్వులను ఆసరాగా చేసుకుని, కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లిపోవడం, విచారణ ఎదుర్కోకుండా తప్పించుకు తిరగడం వంటి ఆరోపణలను అంత తేలికగా తీసిపారేయలేం.” అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఐపీసీ సెక్షన్ 306 కింద ఆత్మహత్యకు ప్రేరేపించడం తీవ్రమైన కేసని న్యాయస్థానం గుర్తుచేసింది.

# ప్రధాన్‌ను తప్పించే బాధ్యత ప్రధానిదే..

**యువత గళమెత్తితేనే వ్యవస్థ గాడిన**

**కేంద్ర విద్యా మంత్రి వారంలో వైదొలగకపోతే భారీగా నిరసనలు**

**సీజేపీ నేత అభిజీత్ దీప్కే హెచ్చరిక**

**జంతర్‌మంతర్ ధర్నా ట్రయలర్ మాత్రమే**

**సీజేపీ నేత అభిజీత్ దీప్కే పిలుపు**

**న్యూఢిల్లీ, జూన్ 7:**
పరీక్షల నిర్వహణలో వైఫల్యానికి కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వారం రోజుల్లో తనంత తాను వైదొలగాలని.. లేదంటే కేంద్రప్రభుత్వమైనా బర్తరఫ్ చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అధినేత అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. ఆయన్ను తప్పించే బాధ్యత ప్రధాని మోదీదేనన్నారు. అలా చేయకుంటే క్షేత్ర స్థాయిలో భారీ ఎత్తున నిరసనలు సాగిస్తామని హెచ్చరించారు. ఆదివారం మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతకుముందు ‘ఎక్స్’లోనూ పోస్టు చేశారు. ప్రధాన్ దిగిపోయేవరకు తమ ఉద్యమం కొనసాగుతుందన్నారు. యువత ప్రశ్నలు అడగాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. వారు గళమెత్తితేనే వ్యవస్థ సక్రమ మార్గంలో నడుస్తుందన్నారు. ‘ఐదేళ్లకోసారి ఓట్లు వేయడం రాజకీయం కాదు. ప్రజలు ఎవరికి ఓటేశారో.. వారిని ప్రశ్నించి తీరాలి’ అని స్పష్టంచేశారు. జంతర్‌మంతర్ ధర్నాలో ప్రధాని మోదీ గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించగా.. పరీక్షల వైఫల్యానికి జవాబుదారీ ఎవరో నిర్ధారించకపోతే.. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను తీసుకోవలసిన బాధ్యత ప్రధానిపై ఉందని బదులిచ్చారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆయన ఆపగలిగినప్పుడు పేపర్ లీక్‌ను ఆపలేరా అని ప్రశ్నించారు. జెన్ జీ భయపడదని శనివారంనాటి జంతర్‌మంతర్ ధర్నా నిరూపించిందన్నారు. ఈ ఉద్యమం ఇక్కడితో ఆగదని చెప్పారు. తన భద్రతపై తన తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని.. అయితే తానిప్పుడు ఒంటరివాడిని కాదని వారికి చెప్పానని అభిజీత్ అన్నారు. సీజేపీ ఉద్యమం పుట్టి 15 రోజులు మాత్రమేనని.. అప్పుడే భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడడం



తొందరపాటు అవుతుందని వ్యాఖ్యానించారు. అయితే, వారం తర్వాత ఈ ఉద్యమాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తామని చెప్పారు. జంతర్‌మంతర్ ధర్నా ట్రయలర్ మాత్రమేనన్నారు. కాగా.. ఛత్రపతి శంభాజీనగర్‌లోని దీప్కే నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. గతంలో 11 మంది పోలీసులను మోహరించగా.. ఇప్పుడు 15 మందికి పెంచామని ఓ పోలీసు అధికారి వెల్లడించారు.

**ఆ పేరు మార్చుకోండి..**
బొద్దింకల జనతా పార్టీ అన్న పేరును మార్చుకోవాలని బీజేపీ సీనియర్ నేత, హరియాణా మంత్రి అనిల్ విజ్ ఆ పార్టీ నేతలకు సూచించారు. ‘ఇది ప్రజాస్వామ్యం. పోరాడే హక్కు, భావవ్యక్తీకరణ హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. అయితే బొద్దింక కనబడితే చిన్న పిల్లవాడైనా దానిని చెప్పుతో కొట్టి చంపుతాడు. అందుచేత మీ పార్టీ పేరు మార్చుకుంటే బాగుంటుంది’ అని సూచించారు.

# వాయుసేనతో నీట్ ప్రశ్నపత్రాల రవాణా


**తొలిసారిగా ఐఏఎఫ్ సేవలు వాడుకోనున్న ఎన్‌టీఏ**




**న్యూఢిల్లీ, జూన్ 7:**
ఈ నెల 21న నిర్వహించనున్న నీట్(రీ ఎగ్జామ్) ప్రశ్నపత్రాల తరలింపు విషయంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) పటిష్ఠ చర్యలు తీసుకుంటోంది. దీనికోసం తొలిసారిగా భారత వాయుసేన(ఐఏఎఫ్) సేవలను వినియోగించుకుంటున్నామని ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ తెలిపారు. ప్రశ్నపత్రాలను ముద్రణాలయాల నుంచి పరీక్షా కేంద్రాలకు చేరవేసే వరకూ ఎలాంటి అవకతవకలకూ తావులేకుండా వాయుసేన పర్యవేక్షణలో విమానాల ద్వారా వాటిని రవాణా చేయనున్నట్టు వెల్లడించారు. మరోవైపు, నీట్ పునఃపరీక్ష పేపర్ లీకైందని లేదా ఆన్‌లైన్‌లో విక్రయానికి ఉందని పేర్కొంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు, సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులు, తల్లిదండ్రులను ఎన్‌టీఏ హెచ్చరించింది. వాటిని నమ్మొద్దని సూచించింది. భారత్‌లోని 551 నగరాలతోపాటు, విదేశాల్లోని 14 నగరాల్లో ఈ నెల 21న నీట్-యూజీ రీఎగ్జామ్ నిర్వహిస్తున్నట్టు ఎన్‌టీఏ తెలిపింది. దీనికి సంబంధించిన పరీక్ష నగరాల సమాచారాన్ని(ఎగ్జామ్ సిటీ ఇంటిమేషన్ స్లిప్) ఆదివారం అధికారికంగా విడుదల చేసింది. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఏ నగరంలో పరీక్ష కేంద్రాలు ఉన్నాయో ముందుగానే తెలుసుకుని తగిన ఏర్పాట్లు చేసుకునేందుకు వీలుగా దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది.

**లిఖితపూర్వక సమాధానం ఇవ్వండి**
నీట్ పేపర్ లీక్, సీబీఎసఈ ఓఎసఎం వివాదాలపై దిగ్విజయ్ సింగ్ నేతృత్వంలోని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తీవ్రంగా స్పందించింది. ఎన్‌టీఏ, సీబీఎసఈలు దీనిపై లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని కోరింది. పేపర్ లీక్ అంటే ఏమిటో నిర్వచించాలని, 2018 నుంచి నిర్వహిస్తున్న పరీక్ష (నీట్)ల్లో ఎప్పుడైనా లీక్ జరిగిందా అని చెప్పాలని కోరింది. ఎన్‌టీఏలోని సిబ్బంది సంఖ్య, 2022 నుంచి చేపట్టిన నియామకాల వివరాలను కూడా తెలియజేయాలని కమిటీ కోరింది.

# అయోధ్య రామాలయ విరాళాలు మాయం: అఖిలేశ్

**లఖ్‌నవూ, జూన్ 7:**
అయోధ్యలోని రామమందిరానికి భక్తుల నుంచి వచ్చిన విరాళాల్లో కోట్లాది రూపాయలు కనిపించడం లేదని ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ అ?ధిపతి అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. ఆదివారం ఎక్స్‌లో హిందీలో పోస్టు పెడుతూ “ప్రపంచవ్యాప్తంగా ఉన్న రామభక్తులకు ఇది బాధ కలిగించే వార్త. రామ మందిరానికి వచ్చిన విరాళాల్లో కోట్లాది రూపాయలు కనిపించడం లేదు. దీనిపై ఆలయ ధర్మకర్తల మండలి, రాష్ట్ర ప్రభుత్వాలు మౌనంగా ఉండడం అనుమానాలు కలిగిస్తున్నాయి” అని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సనాతన ధర్మ విశ్వాసకులకు సంబంధించిన అంశం కావడంతో న్యాయస్థానమే దీనిని పరిగణనలోకి తీసుకొని సుమోటోగా విచారణ జరపాలని కోరారు. దీనిపై శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యుడు మహంత్ దీనేంద్ర దాస్ స్పందించారు. దర్యాప్తునకు సిద్ధమేనని తెలిపారు. ట్రస్టు కార్యదర్శి చంపత్‌రాయ్ ఓ ప్రకటన విడుదల చేస్తూ ప్రస్తుతం అంతర్గత ఆడిట్ జరుగుతోందని, ఇంతవరకు ఎలాంటి లోపాలు వెల్లడి కాలేదని చెప్పారు.

# బెంగాల్‌లో టీఎంసీ నేతలపై జనాగ్రహం

**కోల్‌కతా, జూన్ 7:**
పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ నేతలపై జనాగ్రహం వెల్లువెత్తుతోంది. కట్ మనీ పేరిట నేతలు తమ వద్ద బలవంతంగా వసూలు చేసిన డబ్బు చెల్లించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కట్ మనీ ఆరోపణలు ఎదుర్కొంటోన్న టీఎంసీ నేత బ్రహ్మానంద్ చక్రవర్తి పోలీసులు అరెస్ట్ చేయడానికి వెళ్లినప్పుడు హౌరాలోని ఓ దుకాణంలో చీరల కింద దాక్కున్నారు. ఎట్టకేలకు పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేశారు. మాతాభంగా మున్సిపాలిటీలో కట్ మనీ తీసుకున్న టీఎంసీ కౌన్సిలర్ కకాలి ఘోష్ డబ్బు తిరిగి చెల్లిస్తున్నారు. తమ డబ్బు తిరిగి చెల్లించాలంటూ స్థానికులు టీఎంసీ ఎమ్మెల్యే మదన్ మిత్రా కారుపై గుడ్లతో దాడి చేశారు. టీఎంసీ నేత జయ ప్రకాశ్ మజుందార్, మాజీ మంత్రి స్వరూప్ దాస్‌పై కూడా ప్రజలు గుడ్లు విసిరి తమ నిరసన తెలియజేశారు. మరోవైపు సీఎం సువేందు బాగా పనిచేస్తున్నారంటూ మాజీ సీఎం బుద్ధదేవ్ సతీమణి మీరా ప్రశంసలు కురిపించారు.

## ఐపీవోకి జెప్టో..




**న్యూఢిల్లీ :** క్విక్ కామర్స్ సేవల సంస్థ జెప్టో..స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నది. ఇందుకు సంబంధించి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకున్నది. వాటాల విక్రయం ద్వారా గరిష‘ంగా రూ.11 వేల కోట్ల నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. వచ్చే ఏడాది మార్కెట్లో లిస్ట్ కానున్న అతి పిన్న వయస్సు కలిగిన స్టార్టప్‌లలో ఇది కూడా ఒకటికానున్నది. ఇప్పటికే మార్కెట్లోకి అడుగుపెట్టిన జోమాటో, స్విగ్గీలకు పోటీగా జెప్టో..ఐపీవోకి రాబోతున్నది. 7 బిలియన్ డాలర్ల విలువ కలిగిన జెప్టో..ఈ ఐపీవో ద్వారా 1.8 బిలియన్ డాలర్లు లేదా రూ.16 వేల కోట్ల నిధులు సమీకరించాలని యోచిస్తున్నది. ఈ అక్టోబర్ నెలలో సంస్థ రూ.3,757 కోట్ల నిధులను సమీకరించింది.

## ఐటీఆర్ రిఫండ్ ఆలస్యమా..

### కారణాలు ఇవి కావచ్చు..




**న్యూఢిల్లీ :** మీ ఆదాయ పన్ను (ఐటీ) రిఫండ్ బ్యాంక్ ఖాతాలో ఎప్పుడు జమ అవుతుందా? అని మీరు ఇప్పటికీ వేచి చూస్తున్నారా?.. అసలు ఈ ఏడాది ఇంత సమయం ఎందుకు పడుతున్నది? అని ఆశ్చర్యపోతున్నారా?.. నిజానికి హై-వాల్యూ రిఫండ్ క్లెయిముల పరిష్కారానికి అదనపు వ్యవస్థీక ృత పరిశీలనలుంటాయి. పైగా సెక్షన్ 143(1) ప్రకారం ఐటీ శాఖకు 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను దాఖలైన ఐటీఆర్‌ల ప్రక్రియ కోసం వచ్చే ఏడాది డిసెంబర్ 31దాకా సమయం ఉన్నది. అలాగే ఐటీ చట్టం 1961లోని సెక్షన్ 245(2) కింద కొన్ని పరిస్థితుల్లో రిఫండ్స్ తిరిగి వెనుకకు వెళ్లిపోతాయి. అయితే దీనికి వ్యవస్థీక ృత కారణాలేమీ పెద్దగా ఉండవు. ట్యాక్స్‌పేయర్స్ ద్వారా జరిగిన తప్పిదాలే ఎక్కువగా కారణమవుతూ ఉంటాయి. కాగా, మీ బ్యాంక్ ఖాతా అప్‌డేట్ అవ్వకపోయినా రిఫండ్స్ ఆలస్యం కావచ్చు. కాబట్టి ఈ-ఫైలింగ్ పోర్టల్‌పై మీ ప్రొఫైల్‌లో సరైన బ్యాంక్ ఖాతా వివరాలనే ఉంచాలి. ఇక ఈ-ఫైలింగ్ వెబ్‌సైట్ పేజీ **https://www.incometax.gov.in/iec/foporta**ని సందర్శించి కూడా రిఫండ్ స్టేటస్‌ను తెలుసుకోవచ్చు.

**గుర్తుంచుకోండి..**

మీ ఐటీఆర్ పరిశీలన 30 రోజుల్లోగా పూర్తికాకపోతే దాన్ని ఇన్‌వాలిడ్‌గా పరిగణిస్తారన్న విషయం మీకు తెలుసా? ప్రస్తుత సీబీడీటీ నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో ఐటీ రిటర్న్స్ దాఖలైతే 30 రోజుల్లోగా వెరిఫై కావాల్సిందే. ఇది ఇ-వెరిఫికేషన్ ద్వారానైనా లేదా బెంగళూరు సీపీసీకి సంతకమైన వెరిఫై ఐటీఆర్ భౌతిక కాపీని పంపడం ద్వారానైనా అవుతుంది. ఇక చాలామంది రిటర్న్స్‌ను దాఖలు చేసినా సకాలంలో దాన్ని వెరిఫై చేయడం మర్చిపోతారు. దాంతో డెడ్‌లైన్ ముగిసి అది పనికిరాకుండా పోతుంది.


## లక్ష దాటిన పెట్రోల్ పంపులు




న్యూఢిల్లీ, డిసెంబర్ 25: దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకులు లక్ష దాటిపోయాయి. ప్రభుత్వరంగ సంస్థలు అత్యధికంగా పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయడానికి మొగ్గుచూపడంతో ఈ ఏడాది ఇప్పటి వరకు దేశీయంగా 1,00,266 పెట్రోల్ బంకులు అందుబాటులోకి వచ్చాయి. వీటిలో 90 శాతం ప్రభుత్వరంగ సంస్థలైన ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నడుస్తున్న బంకులు ఉండటం విశేషం. అలాగే ప్రపంచ దేశాల్లో మూడో అతిపెద్ద దేశంగా భారత్ నిలిచినట్లు పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలసిస్ సెల్ తాజాగా వెల్లడించింది. తొలి స్థానంలో అమెరికా ఉండగా, ఆ తర్వాత స్థానంలో చైనా నిలిచింది. వీటితోపాటు ప్రైవేట్ సంస్థలైన నయారా, రిలయన్స్-బీపీ, షెల్‌లు సంయుక్తంగా 10 వేల వరకు నిర్వహిస్తున్నాయి. 2015లో దేశవ్యాప్తంగా 50 వేల స్థాయిలో ఉన్న పెట్రోల్ బంక్‌లు కేవలం పదేండ్లలో రెండింతలు పెరుగడం విశేషం.

# డిజిటలైజేషన్‌లో యూటర్న్!..

### ఆన్‌లైన్‌లో కొత్త ఖాతాల విషయంలో బ్యాంకర్లు అప్రమత్తం




న్యూఢిల్లీ : కొత్త ఖాతాల విషయంలో బ్యాంకర్లు డిజిటలైజేషన్ కంటే సంప్రదాయ పద్ధతులకే మొగ్గు చూపుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా బ్యాంక్ ఖాతాలను తెరువాలని కోరుకునే కస్టమర్ల కోసం బడా బ్యాంకులు ఇప్పుడు భౌతిక పరిశీలనలకే ఆసక్తి కనబరుస్తున్నాయి మరి. మ్యూల్ అకౌంట్లు, మోసాల నేపథ్యంలో కస్టమర్ల ఇంటికే రిలేషన్‌షిప్ మేనేజర్లు వెళ్లి పనిని పూర్తిచేస్తున్నారు. లేకపోతే కస్టమర్లను సమీప బ్యాంక్ శాఖలకు రావాలని బ్యాంక్ వర్గాలు కోరుతున్నాయి.

**బడా బ్యాంకుల్లో..**

ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియాలు తమ ఎండ్-టు-ఎండ్ డిజిటల్ ఆన్‌బోర్డింగ్ వ్యవస్థల్ని పక్కనపెట్టినట్టు తెలుస్తున్నది. ఐసీఐసీఐ బ్యాంక్ తమ ఇన్‌స్టా-అకౌంట్ ఓపెనింగ్ సర్వీస్‌ను ఆపేసిందని సమాచారం. కేవలం సాలరీ ఖాతాలకే డిజిటల్ ప్రక్రియను వినియోగిస్తున్నట్టు చెప్తున్నారు. మిగతా ఖాతాలను ఆశించే కస్టమర్లు డాక్యుమెంట్స్ సమర్పణకు సమీప బ్యాంక్ శాఖకు వెళ్లాలని బ్యాంక్ అధికారులు సూచిస్తున్నారు. దరఖాస్తుల పరిశీలనకు కస్టమర్ల ఇండ్లకే బ్యాంక్ అధికారులూ వెళ్తున్నారని బ్యాంక్ వర్గాలు చెప్తున్నాయి. పైగా పెరుగుతున్న మోసాలకు నో యువర్ కస్టమర్ (కేవైసీ) నిబంధనలను పాటించకపోవడమేనంటూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) బ్యాంకులపై జరిమానాలనూ వేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఈ ఫైన్ల నుంచీ తప్పించుకున్నట్టు అవుతుందని చాలా బ్యాంకులు భౌతిక పరిశీలనలకే జై కొడుతున్నాయి.

**మ్యూల్ ఖాతాల సెగ**

అమాయక ఖాతాదారులను ఏమార్చి నేరగాళ్లు.. తమ అక్రమ కార్యకలాపాల నుంచి ఆర్జించిన సొమ్మును పొందడానికి, బదిలీ చేయడానికి వారి బ్యాంక్ ఖాతాలను వాడుకుంటూ ఉంటారు. మనకు తెలియకుండానే మోసపూరితంగా మన డాక్యుమెంట్లను వాడుకుని బ్యాంకుల్లో మన పేరిట ఖాతాలనూ తెరుస్తారు. వీటినే మ్యూల్ అకౌంట్స్ అంటారు. అయితే ఈ వ్యవహారాన్ని బ్యాంకులు గుర్తిస్తే సదరు ఖాతాలు మూతబడిపోతాయి. అంతేగాక దీంతో ప్రమేయంలేని అమాయకులు సమస్యల్లో పడుతారు. భవిష్యత్తులో వారికి బ్యాంకింగ్ లావాదేవీలు కష్టతరంగా మారుతాయి. ఇక ఇటీవలికాలంలో ఈ మ్యూల్ అకౌంట్స్ పెరిగిపోతున్నాయి.

గత ఏడాది పెద్దపెద్ద బ్యాంకుల్లో మోసపూరిత నగదు లావాదేవీలు భారీగానే జరిగినట్టు గుర్తించారు. అందుకే ఆన్‌లైన్ అకౌంట్ ఆన్‌బోర్డింగ్ సర్వీసు నిబంధనల్ని కఠినతరం చేస్తున్నామని బ్యాంక్ సిబ్బంది అంటున్నారు. డిజిటల్ బ్యాంకింగ్ మార్గాల ద్వారా నకిలీ డాక్యుమెంట్లతో ఖాతాలు తెరుస్తున్న వైనాన్ని అడ్డుకునే దిశగా బ్యాంకులు వెళ్తున్నాయని, అందుకే కస్టమర్లను నేరుగా సంప్రదించాకే ఖాతాలను తెరుస్తున్నాయని ఓ ఫ్రాడ్ డిటెక్షన్ స్టార్టప్ వ్యవస్థాపకుడు తెలిపారు.

**బ్యాంకర్ల మాటేంటి?**

మ్యూల్ ఖాతాలను గుర్తించి సకాలంలో వాటిని మూసేయకపోతే ఆర్బీఐ జరిమానా వేస్తున్నదని బ్యాంకర్లు చెప్తున్నారు. అందుకే ఆన్‌లైన్‌లో ఖాతాల కోసం వచ్చిన దరఖాస్తులపట్ల అప్రమత్తంగా ఉంటున్నామని పేర్కొంటున్నారు. అయినప్పటికీ కొత్త ఖాతాలకు డిజిటలైజేషన్ ఎంతో ముఖ్యమని కూడా వివరిస్తున్నారు. కాబట్టి కస్టమర్లను నేరుగా కలిసేందుకు ప్రయత్నిస్తున్నామని ప్రధాన బ్యాంక్‌లోని ఓ ఉన్నతోద్యోగి తెలిపారు. ఇక ఖాతాదారులకు ఈ మోసాల గురించి అవగాహన కల్పిస్తున్నాయి బ్యాంకులు. కార్డ్ నెంబర్లు, ఏటీఎం పిన్ నెంబర్లు, ఓటీపీలు ఎవ్వరికీ చెప్పరాదని సూచిస్తున్నాయి.

**ఇదీ సంగతి..**

కేంద్రంలో మోదీ సర్కారు అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి బ్యాంకింగ్ వ్యవస్థలో ఆన్‌లైన్ ప్రాధాన్యత పెరిగిపోయింది. అన్నీ ఆన్‌లైన్‌లోనే అన్నట్టు తయారైంది. ఇక పాత పెద్ద నోట్ల రద్దుతో డిజిటల్ పేమెంట్స్ ఊపందుకున్నాయి. కానీ ఇదే సమయంలో బ్యాంక్ మోసాలు కూడా భారీగానే పెరుగడం గమనార్హం. అందరి చేతికి స్మార్ట్‌ఫోన్లు రావడంతో ఇంటర్నెట్ అంతటా విస్తరించింది. 4జీ, 5జీ సేవలు మొదలవడంతో ఇటీవలికాలంలో క ృత్రిమ మేధస్సు (ఏఐ) వాడకం సైతం పుంజుకున్నది. ఈ నేపథ్యంలో సైబర్ మోసగాళ్లు మరింత రెచ్చిపోతున్నారు. దీంతో బ్యాంకులు అప్రమత్తమవుతున్నాయి. ఇందులో భాగంగానే పాత సంప్రదాయ పద్ధతులే సురక్షితం అన్న అభిప్రాయానికి వచ్చేస్తున్నారు. అందుకే తమ డిజిటల్ ఆన్‌బోర్డింగ్ ప్రాసెస్‌లోకి ఫిజికల్ చెక్స్ (భౌతికంగా పరిశీలనలు)ను పరిచయం చేస్తున్నారు.

# పడిపోయిన ఇండ్ల అమ్మకాలు



**హైదరాబాద్ :** హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం మందగమనం దిశగా వెళ్తున్నది. భారతీయ ప్రధాన రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్లలో ఒకటైన అనరాక్ శుక్రవారం విడుదల చేసిన గణాంకాలే ఇందుకు నిదర్శనం. తెలంగాణ రాష్ట్రం ఆవిరవేంచిన దగ్గర్నుంచి దాదాపు పదేండ్లపాటు పరుగులు పెట్టిన ఇక్కడి నిర్మాణ రంగం.. గతకొంత కాలంగా కళ తప్పిందనే చెప్పవచ్చు. ముఖ్యంగా రాష్ట్రంలో అధికారం మారినప్పటి నుంచి నెలకొన్న పరిణామాలు.. ఇండ్ల కొనుగోళ్లకు బ్రేకులు వేశాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ నిర?యాలు రియల్టీని ఉత్సాహపరిస్తే.. ప్రస్తుతం మాత్రం ఆ రకమైన ప్రోత్సాహం కరువైందన్న ఆవేదన మెజారిటీ రియల్టర్లలో కనిపిస్తుండటం గమనార్హం.

**ఇదీ సంగతి..**

ఈ ఏడాది హైదరాబాద్‌లో నివాస గ ృహాల విక్రయాలు గత ఏడాదితో పోల్చితే 23 శాతం తగ్గాయని అనరాక్ తమ తాజా గణాంకాల్లో వెల్లడించింది. దేశవ్యాప్తంగా 7 ప్రధాన నగరాల్లో ఇండ్ల అమ్మకాల తీరుతెన్నులపై అనరాక్ ఓ నివేదికను తీసుకొచ్చింది. ఈ నగరాల్లో హౌజింగ్ సేల్స్‌పరంగా అన్నింటికంటే హైదరాబాద్‌లోనే ఎక్కువ క్షీణత కనిపిస్తుండటం మిక్కిలి గమనించదగ్గ అంశం. 2024లో 58,540 యూనిట్ల విక్రయాలు నమోదైతే..2025లో 44,885 యూనిట్లకే పరిమితమయ్యాయి. హైదరాబాద్ సహా ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్), ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, పుణె, కోల్‌కతా, చెన్నై నగరాల్లో రెసిడెన్షియల్ సేల్స్‌పై అనరాక్ రిపోర్టు ఇచ్చింది. అయితే చెన్నై మినహా అన్ని నగరాల్లో ఇండ్ల అమ్మకాలు పతనమయ్యాయి. 2024తో పోల్చితే 2025లో 15 శాతం పెరిగి 19,220 యూనిట్ల నుంచి 22,180 యూనిట్లకు చేరుకున్నాయి. దీంతో మొత్తంగా చూసినైట్టైతే 14 శాతం క్షీణత చోటుచేసుకున్నది. 2025లో ఈ ఏడు నగరాల్లో ఇండ్ల విక్రయాలు 3,95,625 యూనిట్లుగానే ఉన్నట్టు తేలింది. 2024లో 4,59,645 యూనిట్లుగా ఉన్నాయి. కాగా, అధిక ధరలు, ఐటీ తదితర రంగాల్లో ఉద్యోగుల తొలగింపులతో తగ్గిన డిమాండ్, భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు ఇందుకు కారణమంటూ మార్కెట్ సరళిని అనరాక్ విశ్లేషించింది. అయితే పెరిగిన రేట్ల ద ృష్ట్యా విలువపరంగా అమ్మకాలు 6 శాతం పెరిగి రూ.6 లక్షల కోట్లకు చేరాయన్నది. నిరుడు రూ.5.68 లక్షల కోట్లే. అలాగే ఈ ఏడు నగరాల్లో ఇంటి ధర సగటున 8 శాతం ఎగిసినట్టు పేర్కొన్నది. సరిగ్గా ఏడాది క్రితం చదరపు అడుగు రూ.8,590 పలికితే.. ఇప్పుడు రూ.9,260గా ఉన్నట్టు అనరాక్ ఈ సందర్భంగా తమ నివేదికలో తెలియజేసింది.

**ప్లాటెడ్ డెవలప్‌మెంట్లపై నజర్**

దేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్లంతా ఇప్పుడు ప్లాటెడ్ డెవలప్‌మెంట్లపై ద ృష్టిసారిస్తున్నారు. ఒకప్పుడు అసంఘటిత రియల్టర్లు మాత్రమే ఈ ప్లాట్ల (భూములు) అమ్మకాల్లో ఎక్కువగా ఉండేవారు. ప్రధాన సంస్థలన్నీ భూములను కొని, వాటిలో ఇండ్లు, అపార్ట్‌మెంట్లు నిర్మించి అమ్ముతుండేవి. అయితే ఇప్పుడు బడా సంస్థలు సైతం పెద్ద ఎత్తున భూములను కొని, వాటిని చిన్నచిన్న ప్లాట్లుగా మార్చి, అన్ని సదుపాయాలు (రోడ్లు, త్రాగునీరు, విద్యుత్తు అనుమతులు) కల్పించి విక్రయానికి పెడుతున్నాయి. డీఎల్ఎఫ్, గోద్రెజ్ ప్రాపర్టీస్, బ్రిగేడ్, ప్రెస్టీజ్, పురవంకర, మహీంద్రా లైఫ్‌స్పేసెస్, రుస్తుంజీ తదితర ప్రధాన రియల్ ఎస్టేట్ కంపెనీలు ఇలాంటి ట్రెండ్‌నే అనుసరిస్తున్నాయి. హైదరాబాద్ సహా బెంగళూరు, చెన్నై, గురుగ్రామ్, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా వెంచర్లను తీసుకొస్తున్నాయి. హైదరాబాద్ మరికొన్ని నగరాల్లోనైతే ఎక్కువ డిమాండ్ కనిపిస్తున్నది. కాగా, జైపూర్, సోనిపట్, ఇండోర్, నాగ్‌పూర్, కోయంబత్తూర్, మైసూరు, సూరత్, రాయ్‌పూర్ వంటి కొన్ని ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ ఈ తరహా మార్కెటింగ్ ఊపందుకుంటుండటం విశేషం. నిర్మాణ ప్రాజెక్టులతో ఆదాయం అందుకోవడానికి 4-6 ఏండ్లు పడుతున్నదని, ప్లాటెడ్ ప్రాజెక్టులతో 2-3 ఏండ్లలోనే వ్యాపారం చేసుకుంటున్నామని ఇండస్ట్రీ వర్గాలు చెప్తున్నాయి. కరోనా తర్వాత ప్రవాస భారతీయులు పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబరుస్తుండటం, ఇండిపెండెంట్ హౌస్‌లకు డిమాండ్ కూడా కంపెనీలను ఈ ప్లాట్ల బిజినెస్ వైపునకు నడిపిస్తున్నది.

**ఆఫీస్ స్థలాలకు తగ్గిన డిమాండ్**

హైదరాబాద్‌లో ఆఫీస్ స్థలాలకు గిరాకీ పడిపోయింది. ఈ ఏడాది మూడో త్రైమాసికం(జూలై-సెప్టెంబర్ మధ్యకాలం) నగరంలో ఆఫీస్ స్థలాల డిమాండ్ 19 శాతం పడిపోయి 1.10 కోట్ల చదరపు అడుగుల విస్తీరా?నికి పడిపోయినట్టు కొలియర్స్ ఇండియా తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. మెట్రో నగరాలైన బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, చెన్నై, పూణె, కోల్‌కతాలో పెరుగుదల నమోదుకాగా, కేవలం హైదరాబాద్‌తోపాటు ముంబైలో తగ్గుముఖం పట్టినట్టు వెల్లడించింది.

# సమరీతిలో లేని ఇచ్చిపుచ్చుకోవడాలు!



అమెరికా, భారత్‌ల మధ్య వాణిజ్య చర్చలు ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చాయి. ఉభయ దేశాల ప్రభుత్వాలు 2026 ఫిబ్రవరి 6న ఒక సంయుక్త ప్రకటన జారీ చేశాయి. 'అది ఏమిటి?'. ఇది ఆ సంయుక్త ప్రకటనకు యోగ్యమైన ప్రశ్న. ఆ సంయుక్త ప్రకటన అంతులేని ఊహాగానాలను పురిగొల్పింది. దానిపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. భారత ప్రభుత్వం వాణిజ్య ఒప్పందం వివరాలను విపులంగా వెల్లడించకపోవడం వల్ల ఆ అనుమానాలు పెరిగాయేగానీ తొలగిపోలేదు, తగ్గలేదు. ఉభయ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం ఎలా ఉండాలనే విషయాన్ని ప్రభావదాయకంగా నిర్ణయించిందీ, నిర్దేశించిందీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నది నిరాకరించలేని వాస్తవం. కనుక ఆ సంయుక్త ప్రకటనలోని అంశాలు అమెరికాకు ఆందోళన కలిగించక పోవచ్చు గానీ భారత్‌కు తప్పకుండా కలవరం కలిగిస్తున్నాయి. ఉభయ దేశాల మధ్య వాణిజ్య చర్చలలో పాల్గొన్న భారత్ ప్రతినిధులు గత ఏడాది తాము అమెరికాతో ఒక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే విషయమై సంప్రదింపులు జరుపుతున్నామని పదే పదే ప్రకటించారు. సమీప భవిష్యత్తులోనే అమెరికాతో ఒక ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదరనున్నదని భారత వాణిజ్య మంత్రి స్వయంగా అనేక మార్లు చెప్పారు. 2025 సంవత్సరాంతంలోగానే ఇండో--అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తప్పక ఖరారు అవుతుందని కూడా ఆయన ప్రకటించారు. తీరా కొద్దిరోజుల క్రితం సంయుక్త ప్రకటన ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కాదు. అది ఒక మధ్యంతర ఒప్పందం కూడా కాదు; అది ఒక మధ్యంతర ఒప్పందానికి ఒక చట్రం మాత్రమే. కొండను తవ్వి ఎలుకను పట్టుకున్నాం సుమా! సంయుక్త ప్రకటన జారీ అయిన తరువాత అమెరికా --భారత్ వాణిజ్య ఒప్పందం పరస్పర ప్రయోజనకరమని ఇరు పక్షాలూ ప్రకటించాయి. ఈ వాదన పాఠకుని ఇంగితాన్ని అవమానపరచడమే. సంయుక్త ప్రకటనను పైపైన పరిశీలించినా సదరు ఒప్పందం పరస్పర ప్రయోజనాల ప్రాతిపదికన లేనే లేదని స్పష్టమవుతుంది. ఇప్పుడు ఆ సంయుక్త ప్రకటనను నిశితంగా చూద్దాం: అమెరికా పారిశ్రామిక సరుకులు, ఆహార, వ్యవసాయ ఉత్పత్తులలో చాలా వాటిపై భారత్ సుంకాలను పూర్తిగా తొలగిస్తుంది లేదా గణనీయంగా తగ్గిస్తుంది. ఇందుకు అనుగుణంగా భారత్ ఎగుమతులపై విధించే సుంకాలను అమెరికా (2025 ఏప్రిల్ 2న విధించిన 25 శాతం నుంచి) 18 శాతానికి తగ్గిస్తుంది. జౌళి ఉత్పత్తులు, వస్త్రోత్పత్తులు, చర్మ ఉత్పత్తులు, పాదరక్షలు, ప్లాస్టిక్స్, రబ్బర్, సేంద్రియ రసాయనాలు, గృహాలంకరణ సామగ్రి, చేతి వృత్తుల ఉత్పత్తులు, నిర్దిష్ట యంత్రాలు మొదలైన భారతీయ సరుకులపై అమెరికా సుంకాలు 18 శాతానికి తగ్గనున్నాయి. మధ్యంతర ఒప్పందాన్ని విజయవంతంగా అమలుపరచిన తరువాత జెనరిక్ ఫార్మాస్యూటికల్స్, ముత్యాలు, వజ్రాలు, విమానాల విడిభాగాలు మొదలైన వాటిపై సుంకాలను అమెరికా తొలగిస్తుంది. భారత్ సుంకాలు పూర్తిగా తొలగించవలసి ఉండగా అమెరికా 18 శాతం సుంకాలు విధిస్తుంది-- ఇందులో సుంకాలు పరస్పర ప్రయోజనకరంగా ఉండేందుకు దోహదం చేసేది ఏమైనా ఉన్నదా?! అమెరికా వైద్య పరికరాల వాణిజ్యంలోను, అమెరికా ఐసీటీ సరుకుల విషయంలో పరిమితులతో కూడిన లైసెన్సింగ్ విధానం రద్దు చేసేందుకు సుదీర్ఘకాలంగా ఉన్న అవరోధాలను తొలగించేందుకు భారత్ అంగీకరించింది. అమెరికా ఆహార, వ్యవసాయోత్పత్తుల ఎగుమతులపై సుంకాలేతర అవరోధాలను తొలగించేందుకు కూడా భారత్ అంగీకరించింది. అయితే ఇందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవల్సిన బాధ్యత అమెరికాకు లేదు. సుంకాలేతర అవరోధాలను తొలగించడం భారత్ తప్పనిసరి బాధ్యత కాగా అటువంటి బాధ్యత అమెరికాకు లేదు! ఇది ఎలా పరస్పర ప్రయోజనానికి తోడ్పడుతుంది?; రాబోయే అయిదు సంవత్సరాలలో భారత్ 500 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా ఇంధన ఉత్పత్తులు, విమానాలు, విమాన విడిభాగాలు, విలువైన లోహాలు, టెక్నాలజీ ఉత్పత్తులు, కోకింగ్ కోల్ (ఉక్కు తయారీలో ఉపయోగించే బొగ్గు)ను కొనుగోలు చేస్తుంది. గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు, డేటా సెంటర్స్‌లో ఉపయోగించే ఇతర ఉపకరణాలు మొదలైన టెక్నాలజీ ఉత్పత్తుల వాణిజ్యాన్ని ఉభయ దేశాలు గణనీయంగా పెంపొందించుకున్నాయి. ప్రస్తావిత సరుకులు అన్నీ అమెరికా ఎగుమతులేకానీ, అమెరికా కొనదలుచుకున్న భారత్ ఉత్పత్తులు కావు. ఇటువంటి ఏకపక్ష వాణిజ్యం పరస్పర లబ్ధినిస్తుందా? సంయుక్త ప్రకటనతో పాటు జారీ చేసిన ఒక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో భారత్ చేపట్టనున్న 'ప్రధాన చర్యల' గురించి అమెరికా అధ్యక్షుడు ప్రస్తావించారు. రష్యా నుంచి చమురు ప్రత్యక్ష, పరోక్ష కొనుగోళ్లను నిలిపివేసేందుకు, అమెరికా ఇంధన ఉత్పత్తుల కొనుగోళ్లకు, అమెరికాతో మధ్యంతర ఒప్పంద చట్రాన్ని రక్షణ రంగంలో సహకారానికి కూడా విస్తరింపజేసేందుకు భారత్ కట్టుబడి ఉన్నది. ఈ కారణంగా 2025 ఆగస్టు 6న భారత్ తనపై విధించిన 25శాతం అదనపు సుంకాన్ని ఉపసంహరించుకునేందుకు అమెరికా అధ్యక్షుడు నిర్ణయం తీసుకున్నారు. మూడు కీలక అంశాలలో భారత్ నుంచి హామీ పొంది, అందుకు ప్రత్యుపకారంగా అమెరికా ఎటువంటి సానుకూల నిర్ణయాలు తీసుకోపోవడం పరస్పర ప్రయోజనకర సూత్రానికి అనుగుణంగా ఉన్నదా? రష్యా నుంచి చమురు ప్రత్యక్ష లేదా పరోక్ష కొనుగోలును భారత్ పునఃప్రారంభిస్తే భారతీయ సరుకులపై 25శాతం దండనాత్మక సుంకం విధింపుతో సహా అదనపు కఠిన చర్యలు చేపట్టే విషయాన్ని అమెరికా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది: ఇది బెదిరింపు కాదా? 2026 ఫిబ్రవరి 6న ఉభయదేశాలు అంగీకరించిన వాణిజ్య ఒప్పందం రష్యా చమురు అనే నిర్దిష్ట అంశంపై ఆధారపడి ఉన్నది. భారత్ ఎట్టి పరిస్థితులలోను రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకూడదు. అని అమెరికా నిర్దేశించింది. దాన్ని భారత్ అంగీకరించింది. అమెరికా బెదిరింపు, భారత్ విధేయత మధ్య పరస్పర ప్రయోజనాలకు తోడ్పడేది ఏమైనా ఉన్నదా? 2025 ఏప్రిల్ 2న భారతీయ సరుకులపై అమెరికా సుంకాలు 3శాతంగా మాత్రమే ఉన్నాయి. భారత్‌కు ద్వైపాక్షిక వాణిజ్య మిగులు సమకూరుతున్నందున డోనాల్డ్ ట్రంప్ తన ఎమర్జెన్సీ అధికారాలను ఉపయోగించి భారత్ ఎగుమతులపై సుంకాలను 25శాతానికి పెంచారు. ఇప్పుడు వాటిని 18శాతానికి తగ్గించారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత భారత్ సహా వివిధ దేశాలపై విధించిన ప్రతీకార సుంకాల చట్టబద్ధత అంశం ఇప్పుడు అమెరికా సుప్రీంకోర్టు విచారణలో ఉన్నది. సుంకాల పెంపుదల రాజ్యాంగ విరుద్ధమని అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇస్తే భారత్‌కు ఎనలేని మేలు జరుగుతుంది. సుంకాల విషయంలో పూర్వ స్థితిని ఉభయ దేశాలు పునరుద్ధరించవలసి ఉంటుంది. భారత్‌కు ఎటువంటి ప్రయోజనకర రాయితీలు ఇవ్వకుండానే అమెరికా మన నుంచి అనేక రాయితీలను సాధించుకున్నది. ఇదేమి ఇచ్చిపుచ్చుకోవడం? ఆదాన ప్రదానాలు అసమ రీతిలో ఉండడం న్యాయబద్ధమేనా? ఉక్కు, అల్యూమినియంలపై సుంకాలు 50శాతం నిలిచిపోతాయి, ఆటోమొబైల్స్ విడిభాగాలపై సుంకాలు 25శాతంగా ఉండిపోతాయి. అయితే అమెరికా పారిశ్రామిక వస్తువులు, వ్యవసాయ ఉత్పత్తులు, ఎర్ర జొన్నలు, సోయాబీన్ ఆయిల్, వైన్స్, ఇంకా ఆటోమొబైల్స్, ఎర్ర జొన్నలు, హై--ఎండ్ మోటార్ సైకిల్స్ మొదలైన వాటిపై ఆ దేశం బాగా ప్రయోజనకరమైన రాయితీలను ఇస్తుందని అంతర్జాతీయ వాణిజ్య వ్యవహారాల నిపుణుడు అజయ్ శ్రీవాస్తవ ఎత్తి చూపడం గమనార్హం. రాబోయే అయిదేళ్ల కాలంలో భారత్ 500 బిలియన్ డాలర్లు వెచ్చించి అమెరికా నుంచి కొనుగోలు చేసేది ఏమిటి? ఇదొక పెద్ద ప్రశ్న. అంతేకాదు, చిక్కు ప్రశ్న కూడా, సందేహం లేదు. ఈ 500 బిలియన్ డాలర్ల కొనుగోళ్లతో ప్రస్తుతం అమెరికాతో భారత్‌కు సమకూరుతున్న స్వల్ప వాణిజ్య మిగులు సైతం హరించుకుపోగలదు. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఆసరా అయ్యే అమెరికన్ సరుకులు తక్కువే కనుక అమెరికా నుంచి మనం పెద్ద ఎత్తున విమానాలు, సైనిక సామగ్రి, అమెరికా చమురు మొదలైనవాటిని హైయర్ ల్యాండెడ్ కాస్ట్ (ఒక వస్తువు తయారైన ప్రదేశం నుంచి మీ వినియోగానికి వచ్చే దాకా అయ్యే మొత్తం ఖర్చు ఎక్కువగా ఉండడం. ఈ కారణంగా ఆ వస్తువు ధర సాధారణంగా అత్యధికంగా ఉంటుంది)తో కొనుగోలు చేయడం మనకు అనివార్యమవుతుంది. కొన్న తరువాత వాటిని ఏమి చేయాలో ఎవరైనా చెప్పగలరా?!

# 'విద్యా హక్కు' ఇకనైనా అమలవుతుందా?




'విద్యా హక్కు' ఇకనైనా సుప్రీంకోర్టు ఇటీవల ఒక చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. 'ఒక ఆటో డ్రైవర్ లేదా వీధి వ్యాపారి బిడ్డ, ధనవంతుల బిడ్డతో కలిసి పాఠశాలలో ఒకే బెంచీపై కూర్చోవడం అనేది సహజమైన, నిర్మాణాత్మకమైన ప్రక్రియగా మారాలి. ఇది కేవలం ఒక సంక్షేమ పథకం కాదు. ఆర్టికల్ 21ఏ, 39(ఎఫ్) కింద దేశం చిన్నారులకు ఇచ్చిన హక్కు' అని కోర్టు పేర్కొంది. కులం, తరగతి లేదా ఆర్థిక స్థితిగతుల ఆధారంగా ఉండే 'అనుమానాస్పద గుర్తింపులను' పక్కన పెట్టి, విద్యార్థులు ఒకరితో ఒకరు మమేకంగా ఉండటానికి సెక్షన్ 12 దోహదపడుతుందని ధర్మాసనం వివరించింది. ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలలు ఒకటవ తరగతిలో కనీసం 25శాతం సీట్లు ఉచిత విద్య కోసం సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు తప్పనిసరిగా కేటాయించాలి. విద్యాహక్కు చట్టం అమలుచేయని రాష్ట్రాలు, ముఖ్యంగా తెలంగాణ, ఈ తీర్పును గంభీర హెచ్చరికగా తీసుకుని తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. యూపీఏ ప్రభుత్వ హయాంలో వచ్చిన ముఖ్యమైన చట్టాల్లో విద్యా హక్కు చట్టం ఒకటి. ఇది అమలులోకి వచ్చి పదిహేనేళ్లు గడిచినా, తెలంగాణలో ఆ చట్టం అమలుకు గత ప్రభుత్వాలు ఏమీ చేయలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ చట్టం ఊసే ఎత్తకపోవడం విచారకరం. ఏడాదికేడాది ప్రభుత్వాలు తమ చట్టబద్ధ బాధ్యత నుంచి తప్పుకుంటున్నాయని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. యూడీఐఎస్‌ఈ 2024--25 గణాంకాల ప్రకారం, తెలంగాణలో 1 నుంచి 10 తరగతుల వరకు చదువుతున్న పిల్లల సంఖ్య సుమారు 62 లక్షలు. దాదాపు 59.5 శాతం మంది పిల్లలు ప్రైవేటులో చదువుతున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక ప్రైవేటు బడుల్లో 30 లక్షల మంది విద్యార్థులు ఉంటే, ఇప్పుడది దాదాపు 37 లక్షలకు చేరింది. మరి రాష్ట్ర ప్రభుత్వం పదే పదే ప్రకటించే విప్లవాత్మక మార్పులు ఎప్పుడు వస్తాయో అర్థం కావడం లేదు. ఇదే విద్యా సంవత్సరంలో 1 నుంచి 5 తరగతులలో మొత్తం 30.48 లక్షల విద్యార్థులు నమోదు అయితే, అందులో 20.66 లక్షల విద్యార్థులు ప్రైవేటు బడుల్లో చేరారు. ఒకటవ తరగతిలో 6.62 లక్షల మంది చేరితే, 4.79 లక్షల విద్యార్థులు (72.4 శాతం) ప్రైవేటు బడుల్లో చేరారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల విశ్వాసం ఎంతగా క్షీణించిందో ఈ గణాంకాలే సాక్ష్యం. దేశం మొత్తంలో 7,993 పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉంటే మన రాష్ట్రంలోనే 2,245 (28శాతం) జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలు ఉన్నాయి. గ్రామాల్లో బడుల నిర్వహణ, వసతులు లేని కారణంగా విద్యార్థులు ప్రైవేటు వైపు మొగ్గు చూపుతున్నారు. రాష్ట్రంలో 5,001 సింగిల్ టీచర్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 68 వేల మంది విద్యార్థులు నమోదయ్యారు. అంటే నాణ్యమైన విద్యను ఆశించే తల్లిదండ్రులు ఈ పాఠశాలల మీద నమ్మకం కోల్పోతున్నారు. ఒకసారి పాఠశాల మూసుకుపోతే, ఆ గ్రామంలో ప్రభుత్వ విద్యను పునరుద్ధరించటం చాలా కష్టం. పరిపాలనా స్థాయిలో కూడా పరిస్థితి బలహీనంగానే ఉంది. 630 మండల విద్యాశాఖాధికారుల్లో కేవలం 14 మంది మాత్రమే పూర్తిస్థాయిలో పనిచేస్తున్నారు. కేవలం ముగ్గురు జిల్లా విద్యాధికారులే పూర్తి బాధ్యతలతో ఉన్నారు. దీని ప్రభావం పర్యవేక్షణ, నాణ్యత, బాధ్యత అన్నింటిపైనా పడుతోంది. విద్యకు కేటాయించే బడ్జెట్ విషయంలో తెలంగాణ దేశంలోనే అట్టడుగు స్థానంలో ఉంది. 2014--15లో 10.89శాతంగా ఉన్న విద్యా బడ్జెట్, 2024--25 నాటికి 7.5శాతానికి పడిపోయింది. ఇది కొఠారి కమిషన్ సూచించిన 20శాతం, జాతీయ సగటు 15శాతంతో పోలిస్తే చాలా తక్కువ. బడ్జెట్ తగ్గిన కొద్దీ, మౌలిక వసతులు, ఉపాధ్యాయ నియామకాలు, విద్యా నాణ్యత అన్నీ ప్రభావితమవుతున్నాయి.

ఎన్‌ఎస్‌ఎస్ 80వ సర్వే ప్రకారం, ఒక విద్యార్థిపై సగటు వార్షిక ఖర్చు రూ.50,000కు చేరుతోంది. తెలంగాణలో దాదాపు 37 లక్షల మంది పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారని భావిస్తే, తల్లిదండ్రులు ఏటా సుమారు రూ.18,500 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇది పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్రమైన ఆర్థిక భారంగా మారింది. ఇక ఇంటర్ విద్యను కలిపితే ఈ ఖర్చు ఇంకా ఎక్కువగానే ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రతిపాదన చేసింది. ఇవి కేవలం 2,68,800 విద్యార్థులకు మాత్రమే ఉపయోగపడతాయి. తెలంగాణలో ప్రజా విద్యను పునరుజ్జీవింప చేయాలంటే 2026--27 సంవత్సరానికి విద్యకు కనీసం 20శాతం బడ్జెట్ కేటాయించాలి. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు నమోదు అయిన పాఠశాలలను గుర్తించి సిబ్బంది కొరత లేకుండా వాటికి అన్ని వసతులు కల్పించాలి. విద్యా హక్కు చట్టాన్ని జిల్లాల వారీగా కఠినంగా అమలు చేయాలి. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సెక్షన్ 12(1)(సి)ను వెంటనే అమలుచేయాలి. ప్రైవేట్ పాఠశాలల ఫీజులను నియంత్రించాలి. బాలలందరికీ సమాన విద్య అందించాలంటే ఎక్కువ ప్రభుత్వ వనరులు, మెరుగైన ఉపాధ్యాయులపై అధిక శ్రద్ధ పెట్టాలి. సంక్షేమ పథకాలతో అసమానతలను అంతం చేయడం కష్టం. ప్రభుత్వ నిధులతో కూడిన సమాన, సార్వత్రిక విద్య మాత్రమే సమాజంలో కృత్రిమంగా సృష్టించబడిన సామాజిక అసమానతలను కూల్చివేస్తుంది. ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేసినప్పుడు లేదా ప్రైవేటీకరించినప్పుడు, అసమానతలు కొత్త రూపాల్లో ఏర్పడతాయి. సుప్రీంకోర్టు కూడా ఇదే విషయాన్ని తమ తీర్పులో పేర్కొన్నది. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

# ఫిట్‌గా ఉండేందుకు ఎలాంటి డైట్ ఫాలో కావాలంటే.?



ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, ఫిట్‌గా కనిపించాలని కోరుకుంటున్నారు. కానీ డైట్ విషయంలో సరైన శ్రద్ధ చూపరు. ఫిట్‌గా ఉండటం అంటే తక్కువ తినడం మాత్రమే కాదు, సరైన పోషకాలు ఉన్న ఆహారాన్ని సరైన పరిమాణంలో తీసుకోవాలి. మంచి నిద్ర, రోజూ వ్యాయామం తప్పనిసరి అంటున్నారు వైద్య నిపుణులు. ఫిట్‌గా ఉండాలంటే.. పాలు, అరటిపండు, ఖర్జూరాలు, పండ్లు, ఓట్స్ వంటి ఆహారాలు తీసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

**1. కూరగాయలు, పండ్లు:**
రోజూ కనీసం రెండు రకాల పండ్లు, ఆకుకూరలు మీ ఆహారంలో ఉండేలా చూసుకోండి. వీటిలో ఉండే ఫైబర్(పీచు) జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.

**2. నీరు:**
శరీరం ఫిట్‌గా ఉండాలంటే ప్రతిరోజూ కనీసం 3 నుంచి 4 లీటర్ల నీరు తాగాలి. నీరు శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచి, కండరాల పనితీరును పెంచి, అలసటను తగ్గించి, విష పదార్థాలను బయటకు పంపుతుంది.

**3. జంక్ ఫుడ్‌కు దూరం:**
ప్రస్తుతం బిజీ లైఫ్‌లో చాలా మంది ఇన్‌స్టంట్ ఫుడ్‌పై ఆధారపడుతున్నారు. జంక్ ఫుడ్ అంటే పిజ్జా, బర్గర్లు, సమోసాలు, ఫ్రైడ్ రైస్, మంచూరియా, నూడుల్స్ వంటి నూనెలో వేయించిన పదార్థాలు వంటి వాటికి దూరంగా ఉండాలి. ఇంకా.. స్వీట్లు, కూల్ డ్రింక్స్, ప్యాక్ చేసిన ఐటమ్స్(చిప్స్), ఇతర పానీయాలు తాగడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. ఫిట్‌గా ఉండలేరు.

**4. తినే పద్ధతి:**
ఉదయం వ్యాయామం చేసిన తర్వాత అల్పాహారం తీసుకోవాలి. ఈ విషయంలో నిర్లక్ష్యం చేయొద్దు. ఇది రోజంతా మీకు శక్తినిస్తుంది. రాత్రి పడుకోవడానికి 2-3 గంటల ముందే భోజనం చేయాలి. రాత్రి పూట తేలికపాటి ఆహారం తీసుకుంటే చాలా మంచిది. రోజుకు ఒకేసారి ఎక్కువగా తినకుండా.. కనీసం 5-6 సార్లు తక్కువ మోతాదులో తినడం వల్ల మెటబాలిజం పెరుగుతుంది.

**5. కొబ్బరి నీళ్లు, మజ్జిగ:**
కూల్ డ్రింక్స్, షుగర్ ఉన్న జ్యూస్‌లకు బదులుగా కొబ్బరి నీళ్లు తాగితే మంచిది. ఇందులో ఎలక్ట్రోలైట్స్ ఎక్కువగా ఉంటాయి. జీర్ణక్రియకు, చలువ చేయడానికి మజ్జిగ ఎంతో మంచిది. మెటబాలిజంను పెంచి కొవ్వు కరగడానికి గ్రీన్ టీ ఎంతగానో సాయపడుతుంది.



## నా వ్యక్తిగత జీవితంలోకి తొంగి చూడొద్దు..

కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్,ప్రముఖ నటి త్రిష కృష్ణన్ గురించి గత కొంతకాలంగా సోషల్ మీడియాలో అనేక రకాల ప్రచారాలు జరుగుతున్నాయి. వీరిద్దరి మధ్య ప్రత్యేక బంధం ఉందంటూ వస్తున్న పుకార్లు అభిమానులు, నెటిజన్లలో పెద్ద చర్చకు దారితీశాయి. ముఖ్యంగా విజయ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్తలు వెలుగులోకి వచ్చిన తర్వాత ఈ రూమర్ల తీవ్రత మరింత పెరిగింది. అయితే ఈ ప్రచారాలపై అటు విజయ్ గానీ, ఇటు త్రిష గానీ ఇప్పటివరకు ప్రత్యక్షంగా స్పందించింది లేదు. కానీ తాజాగా త్రిష సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్ మాత్రం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. తన వ్యక్తిగత జీవితంపై జరుగుతున్న చర్చలకు పరోక్షంగా సమాధానం ఇచ్చినట్లుగా ఆమె పోస్టు ఉండటంతో నెటిజన్లు దానిపై ఆసక్తికరంగా స్పందిస్తున్నారు. త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ప్రశాంతంగా నిద్రిస్తున్న తన పెంపుడు కుక్క ఫోటోను షేర్ చేసింది. ఆ ఫోటోకు జత చేసిన క్యాప్షన్ అందరి దృష్టిని ఆకర్షించింది. “నా విషయాల్లో ముక్కు పెట్టడానికి నేను అనుమతించే ఒకే ఒక్క ముక్కు ఇదే” అంటూ ఆమె రాసుకొచ్చింది. ఈ వ్యాఖ్యను చాలా మంది సోషల్ మీడియాలో తన గురించి వస్తున్న రూమర్లకు ఇచ్చిన కౌంటర్‌గా భావిస్తున్నారు. త్రిష ఎవరినీ నేరుగా ఉద్దేశించి మాట్లాడకపోయినా, తన వ్యక్తిగత జీవితంపై నిరంతరం చర్చలు చేసే వారికి ఇది గట్టి సందేశమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సెలబ్రిటీల వ్యక్తిగత విషయాలపై అనవసర ఊహాగానాలు, సోషల్ మీడియా ట్రోలింగ్ పెరుగుతున్న నేపథ్యంలో త్రిష ఈ విధంగా స్పందించడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల త్రిష చేసిన ప్రతి సోషల్ మీడియా పోస్ట్ అభిమానుల మధ్య వైరల్ అవుతుండగా, ఈ తాజా పోస్ట్ కూడా భారీగా షేర్ అవుతోంది. కొందరు ఆమె ధైర్యాన్ని ప్రశంసిస్తుంటే, మరికొందరు ఇది రూమర్లకు ఇచ్చిన సూటి సమాధానమని వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తానికి, త్రిష తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ప్రచారాలను పెద్దగా పట్టించుకోకుండా తనదైన శైలిలో స్పందించింది. ఈ పోస్ట్‌తో అయినా ఆమె గురించి జరుగుతున్న ఊహాగానాలు తగ్గుతాయా లేదా అన్నది చూడాల్సి ఉంది.


## షూటింగ్‌లో కో-స్టార్ వేధింపులు..

**'నాకు ముద్దు పెడుతూనే ఉన్నాడంటూ' బాలీవుడ్ నటి ఆవేదన**



బాలీవుడ్, మరాఠీ చిత్ర పరిశ్రమలలో గుర్తింపు తెచ్చుకున్న నటి ప్రియా బాపట్ తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న ఒక చేదు అనుభవాన్ని తాజాగా పంచుకుంది. తన మొదటి సినిమా షూటింగ్ సమయంలో ఒక పాట చిత్రీకరణలో సహ నటుడు తనకు నచ్చకపోయినా పదే పదే ముద్దు పెట్టుకున్నాడని, ఆ సమయంలో తాను తీవ్ర అసౌకర్యానికి గురయ్యానని ఆమె వెల్లడించారు. కథా చర్చల సమయం నుంచే తాను ఆ ముద్దు సీన్ అవసరమా అని దర్శకుడిని ప్రశ్నించానని, అయితే షూటింగ్ స్పాట్‌లో మాత్రం సదరు నటుడు స్క్రిప్ట్‌లో లేని విధంగా, ఇంప్రూవైజేషన్ పేరుతో హద్దులు దాటి ప్రవర్తించాడని ప్రియా బాపట్ పేర్కొన్నారు. ఆ సమయంలో ఏం చేయాలో తోచక, తన గొంతు ఎలా వినిపించాలో తెలియక ఎంతో నిస్సహాయంగా ఉండిపోయానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఇబ్బందికరమైన వాతావరణం కేవలం షూటింగ్‌తోనే ముగిసిపోలేదని, తామిద్దరూ ఒకే హోటల్‌లో బస చేసినప్పుడు, తాను ఎన్నిసార్లు నిరాకరించినా ఆ నటుడు బ్రేక్‌ఫాస్ట్ లేదా డిన్నర్‌కు రమ్మంటూ పదే పదే వేధించాడని ప్రియ తెలిపారు. ఈ ఘటనతో తీవ్ర ఆందోళనకు గురైన తాను ప్రతిరోజూ రాత్రి తన భర్త ఉమేష్ కామత్‌కు ఫోన్ చేసి ఏడ్చేదాన్నని, దాంతో ఆందోళన చెందిన ఆయన వెంటనే ముంబై నుండి భోపాల్ షూటింగ్ స్పాట్‌కు వచ్చి మూడు రోజుల పాటు తనతోనే ఉన్నారని ఆమె గుర్తు చేసుకున్నారు. 'మున్నాభాయ్ వీదీదీూ' చిత్రంతో పాటు 'సిటీ ఆఫ్ డ్రీమ్స్' వెబ్ సిరీస్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రియా బాపట్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

## చిల్ అవుట్ మూడ్‌లో ప్రియాంకా చోప్రా..



స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి-మహేశ్ బాబు కాంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ వారణాసి గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్టుగా వస్తోన్న ఈ మూవీలో బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమార్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. మాధవన్, ప్రకాశ్ రాజ్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. ప్రియాంకా చోప్రా వారణాసి షూటింగ్ కోసం హైదరాబాద్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఎప్పుడూ షూటింగ్ షెడ్యూల్స్‌తో బిజీబిజీగా గడిపే ఈ భామ కాస్త రిలాక్సింగ్ మూడ్‌లోకి వెళ్లిపోయింది. షూట్ బ్రేక్ టైంలో ఆదివారం సరదాగా స్విమ్మింగ్ చేసింది. బికినీలో ఓ వైపు హొయలుపోతూ.. మరోవైపు అందాలు ఆరబోస్తూ కుర్రకారుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.లాంగ్ గ్యాప్ తర్వాత హైదరాబాద్‌లో ఇలా కనిపించి నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పుడీ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. వారణాసి చిత్రాన్ని శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.

ఈ మూవీకి ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. ఈ మూవీ ఫస్ట్ పార్ట్‌ను 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయన్నట్టు ఇప్పటికే ప్రకటించింది టీం. సెకండ్ పార్ట్ 2029లో వస్తుందని వార్తలు రాగా.. రాజమౌళి టీం రాబోయే రోజుల్లో ఏదైనా క్లారిటీ ఇస్తుందేమో చూడాలి.

## ఇండస్ట్రీలో అది గోల్డెన్ రూల్



సాంఘిక మాధ్యమం అనేది పరిశ్రమలో చాలామందికి వ్యసనంగా, ఇంకా చెప్పాలంటే శాపంగా మారిందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రష్మిక మందన్నా అన్నారు. సోషల్ మీడియాలో నెగెటివిటీ గురించి మాట్లాడుతూ ఆమె పై రీతిగా స్పందించారు. 'పాజిటివ్ కామెంట్స్ వందల్లో ఉన్నప్పటికీ, ఎక్కడో ఒక మూల ఉన్న నెగెటివ్ కామెంట్ మనశ్శాంతిని పూర్తిగా దెబ్బతీస్తుంది. రోజంతా పడ్డ కష్టాన్ని, తద్వారా వచ్చిన ఆనందాన్ని క్షణాల్లో మాయం చేస్తుంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే నేనూ.. నా సినిమాలు విడుదలైన సమయంలో విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటూ ఉంటాను. రిలీజ్ రోజులో పగటిపూట వాతావరణం చాలా బావుంటుంది. కామెంట్లన్నీ సానుకూలంగా కనిపిస్తాయి. రాత్రి 9గంటలు దాటాక నెగెటివిటీ, ట్రోలింగ్ ఒక్కసారిగా పెరుగుతుంది. రోజంతా ప్రశాం తంగా ఉన్న నెటిజన్లు, రాత్రి కాగానే ఎందుకు అంతలా మారిపో తారో అర్థంకాదు. దీనివల్ల రాత్రి 9గంటలు దాటాక ఎట్టి పరిస్థితుల్లోనూ సోషల్ మీడియా ఓపెన్ చేయకూడదనేది

Printed, Published, Editor and owned by K.Koteshwar Rao, Ph.9052477378,#6-1-106, 1st Floor, shop No. 13&14&, near Post office Khairatabad, Hyderabad-04, T.S. RNI No. APTEL/2013/54465, Volme: 12, Issu:103